
ఆంధ్రజ్యోతి





జంబూపట్నంలో మూతపడిన ఈఎస్సీ జీడి పప్పు ఫ్యాక్టరీ

రైల్వే స్టేషన్ల అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది.. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌ని అధునాతనంగా తీర్చిదిద్దే పనులకు ప్రధాని మోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.. రూ.270 కోట్లతో రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయనున్నారు. అదే విధంగా నిడదవోలు మండలం శెట్టిపేట వద్ద రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనపర్తి రైల్వే స్టేషన్‌ను రూ.20.70 కోట్లతో అభివృద్ధి చేసే పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైల్వే పనులు వేగవంతం కానున్నాయి.. - వివరాలు 7లో

బంగారం దొంగలను పట్టేశారు..



పోలీసులు వేగంగా స్పందించారు.. ఇన్‌కంట్యాక్స్ అధికారులమంటూ నమ్మించి బంగారం వ్యాపారి నుంచి రూ.2 కోట్ల విలువైన 3.5 కేజీల బంగారం చోరీ చేసిన కేసును కేవలం ఐదు రోజుల్లోనే ఛేదించారు.. 12 మంది నిందితులను గుర్తించి 9 మందిని అరెస్టు చేశారు. - వివరాలు 7లో



పల్స్ పోలియో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

3న పల్స్ పోలియో విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26 : జిల్లాను పోలియోరహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి.. మార్చి 3న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. రాజమహేంద్రవరం (బొమ్మూరు)లోని కలెక్టర్ స్పందన హాల్లో పల్స్‌పోలియో కార్యక్రమంపై సోమవారం జరిగిన జిల్లా టాస్కుఫోర్సు కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు మొత్తం 1,90,479 మందికీ పోలియో చుక్కలు వేయడానికి 1060 పోలియో బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బస్టాండు, రైల్వే స్టేషన్లు వంటి ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేయడానికి 60 ట్రాన్సిట్ టీంలు, 47 మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. 465 హైరిస్క్ ప్రాంతాల్లో మొబైల్ టీంల ద్వారా పోలియో చుక్కలు వేయిస్తామన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ రాజకుమారి, డీఆర్‌వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26: విద్యార్థులు ఆర్థిక అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ మాధవీలత అన్నారు. ఆర్థిక అక్షరాసత్య వారోత్సవాలు పోస్టర్‌ను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల వచ్చే నెల ఒకటో తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు.కార్యక్రమంలో జేసీ తేజ్ భరత్ , ఎల్‌డిఎం డివి.ప్రసాద్, డీఆర్‌వో నరసింహులు పాల్గొన్నారు.



లెక్చర్ సిరీస్ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్‌జేడీ కృష్ణ

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలి

లెక్చర్ సిరీస్ ప్రారంభంలో ఆర్‌జేడీ కృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26 : విద్యార్థులు బయో టెక్నాలజీ రంగంలో పరిశోధనలవైపు ఆకర్షితులు కావాలని ఉన్నత విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ కృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం పాపులర్ లెక్చర్ సిరీస్ అడ్వాన్సెస్ ఇన్ బయోటెక్రానికల్స్ ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకూ పాపులర్ లెక్చర్ సిరీస్ జరుగుతుందన్నారు. తొలిరోజున కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ వై.సురేష్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మైక్రోబియల్ అండ్ ప్లాంట్ బయోపెస్టిసైడ్స్ ఫర్ క్రాఫ్ట్ ఇంప్రూవ్‌మెంట్ అనే అంశంపై వివరించారు. సమన్వయకర్తగా అనూష వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్శిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయనిర్మల, బయోటెక్నాలజీ విభాగాధిపతి బి.నాగేశ్వరి, కళాశాల అధ్యాపకులు ఏ.అన్నపూర్ణ, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఘోరం

- లారీ డ్రైవర్లపై దూసుకెళ్లిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ
- అక్కడికక్కడే నలుగురి దుర్మరణం
- మృతుల్లో ముగ్గురు లారీడ్రైవర్లు.. ఆలయ సేవకుడు
- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు హైవేపై దారుణ ఘటన

7లో

పారిశ్రామిక.. పతనం



కొవ్వూరు మండలం విజ్జేశ్వరం వద్ద మూతపడిన జీటీపీఎస్

పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇదీ ఎన్నికలకు ముందు సీఎం జగన్ మాట.. ఇంకేంటి మన గ్రామాల్లో పరిశ్రమ ఉంటే మనకే ఉద్యోగాలనుకున్నారంతా.. ఓట్లేసి గెలిపించారు.. తీరా చూస్తే ఈ ఐదేళ్లలో ఎన్నడూ లేనంతా పారిశ్రామిక పతనం ఆరంభమైంది.. స్థానికులకు 75 శాతం ఉద్యోగాల మాట అటుంచి.. పాలకుల బెదిరింపులు.. పరిశ్రమలకు ముడి సరుకు సరఫరాలో ఇబ్బందులతో ఉన్న పరిశ్రమలనే మూసేశారు.. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు 10 పరిశ్రమల పైనే మూతపడి.. వేలాది మంది ఉపాధి కోల్పోయారంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కొత్త పరిశ్రమల మాట దేవుడెరుగు.. వేలాది మందికి ఉపాధినిచ్చే పాత పరిశ్రమలు వరుసగా మూతపడుతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సుమారు 10 పరిశ్రమలు పైనే మూతపడగా వేలాది మంది ఉపాధి కోల్పోయారు.ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రస్తుతం బతుకుజీవుడా అంటూ ఏదో ఒక పని చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం సంక్షేమం పేరుతో పథకాలెన్ని ఇచ్చినా ఉపాధి లేక కుటుంబాలు గడవడమే కష్టతరంగా మారింది.. అయినా అక్కడ పాలకులు కానీ.. ఉన్నతాధికారులు కానీ ఉపాధి కోల్పోయిన కుటుంబాలను పట్టించుకున్న దాఖలాలు లేవు.

పాతవి మూత..కొత్తవి లేవు..

గొప్పలు చెబుతున్న ప్రభుత్వం

జిల్లాలో పరిశ్రమల సంగతి ఇలా ఉంటే ప్రభుత్వం మాత్రం ఎంతో సాధించినట్టు చెప్పడం గమనార్హం. జిల్లాలో 2023-24లోనే ఏకంగా 6,748 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో 1109 కోట్ల పెట్టుబడి పెట్టడం వల్ల 25,222 మందికి ఉపాధి కల్పించినట్టు చెబుతున్నారు. జిల్లాలో ఇంకా రూ.3760 కోట్ల పెట్టుబడితో భారీ పరిశ్రమలు రాబోతున్నాయని వాటి ద్వారా 5,910 మందికి ఉపాధి లభిస్తుందని అంటున్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ (జీఐఎస్)లో 116 పరిశ్రమల స్థాపనకు దరఖాస్తులు వచ్చాయన్నారు.కానీ అవి ఏ దశలో ఉన్నాయో, అవి ఏంటో స్పష్టమైన సమాచారం లేదు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద 378 యూనిట్లు నెలకొల్పినట్టు చెబుతున్నారు. బిక్కవోలులో బిర్లా సంస్థ ఆధ్వర్యంలో ఉప్పు ఆధారిత పరిశ్రమను విస్తరణ చేయనున్నట్టు చెబుతున్నారు. గోకవరంలో ఇథనాల్ ఉత్పత్తి పరిశ్రమకు సీఎం జగన్ స్వయంగా శంకుస్థాపన చేశారు. కానీ అది ఇంకా పూర్తి కాలేదు. కొవ్వూరు మండలం పరిధిలో నిర్మించనున్న రిలయన్స్ బయోగ్యాస్ ఇండస్ట్రీకి ఇటీవల శంకుస్థాపన చేశారు. కానీ దీనికి సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని అన్ని ఏర్పాట్లు చేశారు. విచిత్రమేమిటంటే ఈ సంస్థకు చెందిన యాజమాన్యం నుంచి ముఖ్యులెవరూ హాజరు కాలేదు. దీనితో మంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

కొత్త పరిశ్రమలేవ్...

పూర్వ నుంచి ఇప్పటి వరకూ జిల్లాలో 37 భారీ పరిశ్రమలు.. రూ.6798.65 కోట్ల పెట్టుబడులు ఉన్నాయనేది పాత లెక్క. ఆయా కంపెనీల్లో 17546 మంది ఉపాధి పొందుతున్నారని చెబుతున్నారు. వీటిలో ప్రస్తుతం పదుల సంఖ్యలో కంపెనీలు మూతపడ్డాయి. సీఎం జగన్ గోకవరం మండలంలోని గుమ్మలదొడ్డిలో శంకుస్థాపన చేసిన అసాగో ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ ఇంకా ఉత్పత్తిలోకి రాలేదు. రూ.260 కోట్ల పెట్టుబడి పెడుతున్నారని 210 మందికి ఉద్యోగాలు వస్తాయని చెబుతున్నారు.కానీ ఇది ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేకపోతున్నారు.పంగిడిలో రూ.1350 కోట్లతో త్రివేణి రిన్యూవేబుల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సోలార్ గ్లాస్‌లు తయారు చేస్తామని, ఇక్కడ 2,400 మందికి ఉపాధి ఉంటుందని చెప్పారు. ఇది ఇంకా ఉత్పత్తిలోకి రాలేదు. ఆంధ్రపేపరు మిల్లు విస్తరణకు విశాఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఒప్పందం జరిగింది.కానీ రూ.2వేల కోట్లతో విస్తరించి, 2300 ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇంకా ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ రాలేదు. పెరవలిలో రవలి స్పిన్నర్స్‌ను విస్తరిస్తామని,రూ.150 కోట్ల పెట్టుబడి ఉందని, 1000 మంది ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇంకా ప్రారంభం కాలేదు. 2022 మార్చి నుంచి ఈ ఏడాది జనవరి వరకూ 22,132 మంది ఎంటర్‌ప్రైజెస్ రూ. 2718 కోట్ల పెట్టుబడి తో 66,520 మందికి ఉపాధి కల్పించినట్టు ప్రచారం చేస్తున్నారు.కానీ వాస్తవ రూపం వేరేగా ఉంది. అనేక పరిశ్రమలు కుదేలైపోతున్నాయి.

- జిల్లాలో మూతపడిన పరిశ్రమలు
- జీటీపీఎస్.. జీఎంఆర్ లాకౌట్
- తెరుచుకోని చాగల్లు షుగర్స్
- భయపడిన ఈఎస్‌సీ కంపెనీ
- కార్న్ ఫౌడర్ ఫ్యాక్టరీ లేఆఫ్
- రోడ్డున పడిన వేలాది మంది
- ఉద్యోగాల్లేక విలవిల
- స్థానికులకు 75శాతం ఉద్యోగాలెక్కడ
- ఉన్నవి పీకేసిన వైసీపీ ప్రభుత్వం
- జిల్లాలో పెరిగిన నిరుద్యోగిత

స్థానికులకు ఉద్యోగాలేవీ?

పరిశ్రమ స్థాపించినప్పుడు ఎంతోగొప్పగా ప్రచారం చేసే అధికారులు మూత పడితే దానికి సరైన కారణాలు చెప్పడంలేదు. పైగా ఉద్యోగుల ఉపాధి సంగతిని పట్టించుకోవడంలేదు. బిక్కవోలు ఉప్పు ఆధారిత పరిశ్రమను బిర్లా కంపెనీ నెలకొల్పింది. ఇక్కడ స్థానికుల కంటే ఇతర్లే ఎక్కువ అనే ప్రచారం ఉంది. మిగతా పరిశ్రమలలో ఆదే పరిస్థితి. సీఎం జగన్ ఇచ్చిన 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే హామీ ఎక్కడా నెరవేరడం లేదు. నైపుణ్య కార్మికుల పేరుతో దగా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పరిశ్రమ ఉన్న ప్రాంతంలో కింద స్థాయి పను లకు మాత్రమే ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో నిరుద్యోగులు ఉద్యోగాల్లేక ఇబ్బందులు పడుతున్నారు.

పరిశ్రమలు మూతపడ్డాయిలా..

చాలా కాలంగా జీడిపప్పు పరిశ్రమలో ఉన్న కేరళకు చెందిన ఈఎస్‌సీ కంపెనీ సుమారు ఆరు నెలల కిందట తన ఫ్యాక్టరీలన్నీ మూసివేసింది. దివాన్‌చెరువు, జంబూపట్నం, కోటికేశ్వరంతో పాటు ఇతర జిల్లాల్లో ఉన్న అనేక ఫ్యాక్టరీలు మూతపడ్డాయి.ఈ ఫ్యాక్టరీల్లో మహిళలు ఎక్కువగా పనిచేసేవారు. ప్రభుత్వ పెద్దలు కంపెనీ యాజమాన్యాన్ని బెదిరించడంతో వారి కోరికలు తీర్చ లేక రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న వీరి ఫ్యాక్టరీలన్నీ మూసేసుకున్నట్టు ఉపాధి కోల్పోయిన ఉద్యోగులు చెబుతున్నారు. ఈ కంపెనీ స్థానికంగా జీడిపిక్కలు కొని ప్రాసెస్ చేసి పప్పును ఎక్కువగా విదేశాలకు సరఫరా చేసేది. ఆయా పరిశ్రమలు ఆకస్మికంగా మూతపడడంతో అనేక కుటుంబాలు కనీస పోషణ పోయింది. వీరిని కనీసం పలకరించేవారు లేరు.

చాగల్లులోని జైపూర్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని ఎన్నికల ముందు జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయినా కనీసం పట్టించు కోవడంలేదు. బ్యాంక్ గొడవలు, ఇతర కారణాలతో సీఐడీ విచారణ వల్ల ఫ్యాక్టరీ ఇబ్బందుల్లో పడిన సంగతి తెలి సిందే. సుమారు 2500 మంది వరకూ ఉద్యోగుల కుటుం బాలు రోడ్డున పడ్డాయి.

వేమగిరిలో జీఎంఆర్ విద్యుత్ ప్రాజెక్టు మూత పడింది. అనేక మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వానికి సంబంధించిన జీవీకే పవర్ ప్రాజెక్టు మూత పడింది. ఇక్కడ 200 మంది వరకూ ఉద్యోగులు ఉం డేవారు. సడన్‌గా మూసివేయడంతో ప్రత్యక్షంగా 200 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రస్తుతం కేవలం 25 మంది విద్యుత్‌శాఖ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.విద్యుదుత్పత్తిలేదు.గ్యాస్ కొరత కారణంగా విద్యుత్ పరిశ్రమలు మూతపడిన సంగతి తెలిసిందే. సిరామిక్స్ ఇండస్ట్రీస్, పలు రైసు మిల్లులు మూత పడ్డాయి.

బిక్కవోలు మండలంలోని బలభద్రపురం శివారులో ఉన్న కార్న్ ఫౌడర్ ఫ్యాక్టరీ యాజమాన్యం మూడు నెలల నుంచి లేఆఫ్ ప్రకటించింది. ఉద్యోగులను విధులకు రానీయడం లేదు.ఈ ఫ్యాక్టరీ సుమారు 20 ఏళ్ల కిందట నుంచి ఉంది. ఆకస్మికంగా ఉద్యోగులను తొలగించడంతో ఇక్కడ ఆందోళన మొదలైంది. ఇక్కడ మొక్కజొన్నతో ఫౌడర్ తయారు చేసేవారు. రోజుకు 10 టన్నుల వరకూ ఉత్పత్తి అయ్యేది.మొదట ఆంధ్రులే పరిశ్రమ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గుజరాత్‌కు చెందిన వారు నడుపుతున్నారు.వేరే చోట్ల యూనిట్లు పెట్టుకోవడం కోసం ఇక్కడ మూసేస్తున్నట్టు అధికారుల చెబుతున్న కథనం.గుజరాత్ నుంచి తక్కువ జీతాలకు కూలీలను రప్పించుకుంటున్నారనే వాదన ఉంది.



మూతపడిన జీటీపీఎస్

రెండో జాబితాపై కసరత్తు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

త్వరలో టీడీపీ- జనసేన రెండో జాబితా ప్రకటించడానికి కసరత్తు ఆరంభమైంది. త్వరలో ఈ జాబితాను ప్రకటించనుంది. ఇప్పటికే జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలకు ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీ నుంచి రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలను ఉమ్మడి అభ్యర్థులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.రాజానగరం నుంచి జనసేన నేత బత్తుల బలరామకృష్ణ అభ్యర్థిగా ఖరారయ్యారు.వీరి పేర్లు అధికారికంగా కూడా ప్రకటించాల్సి ఉంది. ఇక రాజమహేంద్రవరం రూరల్ నుంచి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ పేర్లనే ఖాయంచేసినట్టు సమాచారం. త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో జనసేన కార్యకర్తల్లోనూ, నిడదవోలు టీడీపీ వర్గాల్లో ఏర్పడిన ఆందోళనను తగ్గించే బాధ్యత కూడా అధిష్ఠానమే తీసుకోవడం గమనార్హం. కొద్దిరోజుల్లో జిల్లాలో సమస్యలన్నీ సద్దుమణుగుతాయని రెండు పార్టీల నేతలు చెబుతున్నారు. ఇక గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు పేరు కూడా ఖరారైనట్టే. అది కూడా అధిష్ఠానం ప్రకటించాల్సి ఉంది. కొవ్వూరు నియోజకవర్గంలో అభ్యర్థి ఎవరనే దానిపై స్పష్టత లేదు. ఎంపీ అభ్యర్థి విషయంలో కూడా స్పష్టత రావాల్సి ఉంది. జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్రను చల్లబరిచే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.ప్రస్తుతం జిల్లాలోని టీడీపీ-జనసేన నేతలంతా ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో జరిగే ఉమ్మడి బహిరంగ సభపై దృష్టి పెట్టారు.

జిల్లాలో టిక్కెట్ల టెన్షన్

- రాజమహేంద్రవరం రూరల్‌కు గోరంట్ల
- నిడదవోలుకు కందుల దుర్గేష్
- 4 సీట్ల ప్రకటనపై ఉత్కంఠ
- త్వరలో అధికారిక ప్రకటన



నిడదవోలులో మాట్లాడుతున్న పట్టణాధ్యక్షుడు వెంకటేశ్వరరావు

నిడదవోలు సీటు శేషారావుకే కేటాయించాలి

టీడీపీ నాయకుల డిమాండ్

నిడదవోలు, ఫిబ్రవరి 26 : నిడదవోలు నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా విజయం సాధించే సత్తా ఉన్న బూరుగుపల్లి శేషారావుకే టికెట్ ఖరారు చేస్తారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. నిడదవోలు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కాకుండా లేని సమయంలో కూడా ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. ఉండ్రాజవరం మండల అధ్యక్షుడు సింహాద్రి రామ కృష్ణ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్య కర్తల అభిప్రాయానికి టీడీపీ అధినాయకత్వం విలువ ఇస్తుందన్నారు.తప్పనిసరిగా శేషారావుకే టిక్కెట్ వస్తుందన్నారు. కార్యక్రమంలో అతికాల రామకృష్ణ మ్మ,భూపతి రవివర్మ, తిరుపతి సత్యనారాయణ, వెలగన సూర్యారావు, పాల్గొన్నారు.

నిడదవోలు టిక్కెట్ ఎవరికిచ్చినా గెలిపించుకుందాం : కుందుల



పెరవలి : నిడదవోలు నియోజకవర్గంలో టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఎవరిని నియమించినా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని నియోజకవర్గ టీడీపీ నాయకుడు కుందుల సత్యనారాయణ అన్నారు.టీడీపీ, జనసేనల ఆధ్వర్యం లో రాబోయే ఎన్నికల్లో గెలుపు సాధించి చంద్రబాబు నాయుడిని సీఎం చేయడమే అందరి లక్ష్యంగా ఉండాలన్నారు. వర్గ విభేదాలు విడనాడి కలిసికట్టుగా పని చేయాలని సూచించారు.మార్చి 1 నుంచి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు.

3వ రోజుకు పాటంశెట్టి దీక్ష

గోకవరం, ఫిబ్రవరి 26 : గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాటంశెట్టి సూర్యచంద్ర దంపతులు చేపట్టిన నిరసన దీక్ష సోమవారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. జగ్గంపేట టీడీపీ అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూను ప్రకటించడం పట్ల ఆయన అసంతృప్తికి గురైన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో సూర్యచంద్ర దంపతులు అంతిమ ఆమరణ నిరహారదీక్షకు దిగారు. కాగా అచ్యుతాపురంలోని కనకదుర్గమ్మ గుడిలో దీక్షకు దిగిన సూర్యచంద్ర దంపతులు సోమవారం గుడి నుంచి బయటకు వచ్చి సమీపంలోని రావిచెట్టు కింద ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఈ మేరకు టీడీపీ, వైసీపీ నాయకులు పరామర్శించారు.



ఆలయం వెలుపల చెట్టు కింద దీక్ష కొనసాగిస్తున్న పాటంశెట్టి దంపతులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ఎన్నికల కమిషన్ దృష్టికి అనపర్తి అక్రమాలు

- డమ్మీ పట్టాల విచారణపై కలెక్టర్‌ను కలిసిన నల్లమిల్లి
- అనపర్తి అధికారులకు వత్తాసు పలకడంపై ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ఫిబ్రవరి 26 : అక్రమంగా డమ్మీ పట్టాలు తయారు చేస్తున్న అధికారులకు వత్తాసుపలుకున్న కలెక్టర్ , జేసీ వంటి వారితో వచ్చే ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగవని అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం జిల్లాకలెక్టర్‌లో సోమవారం ఆయన తెలుగు రైతులతో కలిసి కలెక్టర్ డాక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్‌లను కలిసి అనపర్తిలో డమ్మీపట్టాల విచారణ జాప్యంపై ప్రశ్నించారు. దీంతో కలెక్టర్, జేసీలకు రామకృష్ణారెడ్డికి మధ్య వాదన జరిగింది. డమ్మీపట్టాలు చేసిన అధికారులను సమర్థిస్తున్నారంటూ రామకృష్ణారెడ్డి అధికారులను నిలదీశారు. అనంతరం వినతి పత్రం అందించారు. రామకృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలో భూసేకరణ జరగకుండా తహశీల్దార్ కార్యాలయంలో డమ్మీపట్టాలు 2వేలు తయారు చేయడాన్ని గుర్తించామన్నారు. అనపర్తిలో జరుగుతున్న అక్రమాలపై ప్రశ్నిస్తే జాయింట్ కలెక్టర్ ఎవార్డు పాస్ చేశామంటున్నారన్నారు. భూసేకరణ జరగని దానికి ఏ విధంగా ఎవార్డు ఇస్తారని ప్రశ్నించారు. బిక్కవోలులో పోసిబాబు అనే అధికారి బదిలీపై వెళ్లి మళ్లీ వచ్చి 120 పట్టాలు వెనుక తేదీతో వేస్తే దానిపై తాను ఫిర్యాదు చేస్తే ఆర్‌డీవో విచారణకు ఆదేశించారన్నారు.ఈ రోజుకు 14 రోజులు గడిచిన విచారణ లేదన్నారు. కేవలం వారం రోజుల ఎన్నికల శిక్షణ సాకుతో విచారణ చేయకుండా కాలయాపన చేసి సమర్థించుకుంటున్నారన్నారు. ఈ విషయలన్నింటిని ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నాం 1 గంట వరకు జరిగిన స్పందనలో కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, డీఆర్‌వో నరసింహులు 177 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించారు.

కలెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం మేరకే పట్టాలు సిద్ధం

అనపర్తి,ఫిబ్రవరి 26 : కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు అనపర్తి మండలంలో పెండింగ్‌లో ఉన్న స్థల లబ్ధిదారులకు పట్టాలు తయారు చేస్తున్నామని అనపర్తి తహశీల్దార్ నాగరాజు పేర్కొన్నారు. డమ్మీ పట్టాల అంశంపై వివరణ ఇస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. 2019లో మండలంలో 5409 మంది లబ్ధిదారులను గుర్తించామని వారిలో 2350 మందికి గతంలో పట్టాలు అందించామని మిగిలిన 3059 మంది లబ్ధిదారులకు భూసేకరణ చేశామన్నారు. ప్రభుత్వం వారి నుంచి డబ్బులు వస్తాయని వాటికి సంబంధించిన నివేశన స్థల పట్టాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ కార్యాలయం నుండి వచ్చిన సమాచారం మేరకు పట్టాలు తయారు చేస్తున్నామన్నారు.

ఘోరం

లారీడ్రైవర్లపై దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

అక్కడికక్కడే నలుగురి మృతి

మృతుల్లో ముగ్గురు లారీడ్రైవర్లు.. మరొకరు ఆలయ సేవకుడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు హైవేపై దారుణ ఘటన

ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ అరెస్టు



బంధువుల రోదన



ప్రమాదానికి కారణమైన బస్సు



సంఘటన స్థలంలో పోలీసులు



ఆటోలో మృతదేహాలు



నాగయ్య



కిషోర్



ప్రసాద్



లోవరాజు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 26: పంక్చర్ అయిన లారీ టైరు మారుస్తున్న డ్రైవర్లపై మృత్యుశకటంలా ఆర్టీసీ బస్సు దూసుకువచ్చింది. ఈ ఘటనలో ముగ్గురు డ్రైవర్లు ప్రాణాలు కోల్పోగా అమ్మవారి ఆలయ సేవకుడు కూడా మృత్యువాతకు గురయ్యాడు. ఈ ఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సమీపంలో పాదాలమ్మ గుడి వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున జరిగింది. స్థానిక సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్యక్ష సాక్షులు అందించిన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా బల్లికురువ మండలం నక్కబొక్కలపాడుకు చెందిన డ్రైవర్ బండి నాగయ్య(26), అదే మండలానికి చెందిన రామాంజనేయపురం గ్రామానికి చెందిన దాసరి కిషోర్(50), దాసరి ప్రసాద్(40) లారీడ్రైవర్లు. వీరు ముగ్గురు దాసరి ప్రసాద్, బండి నాగయ్య ఒక లారీపై, దాసరి కిషోర్ మరో లారీపైన ఒడిసా నుంచి బాపట్లకు హెచ్‌పీ వైర్ల లోడుతో బయల్దేరారు. వీరి రెండు లారీలు ఒకదాని వెంట మరొకరి ప్రయాణిస్తుండగా 16వ నెంబరు జాతీయ రహదారి ప్రత్తిపాడు పాదాలమ్మ గుడివద్దకు సోమవారం తెల్లవారుజామున 4గంటలకు చేరుకోగానే వెనుక లారీ టైరు పంక్చర్ అయింది. దీంతో రెండు లారీలు పాదాలమ్మగుడి సమీపంలో రోడ్డు మార్జిన్ వద్ద నిలిపివేసి ముగ్గురు డ్రైవర్లు పంక్చర్ అయిన టైర్ మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో విశాఖపట్నం నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా బస్సును నడుపుతూ టైర్ పంక్చర్ పనులు చేస్తున్న ముగ్గురు డ్రైవర్లపై దూసుకువెళ్లాడు. అదే క్రమంలో పాదాలమ్మ ఆలయం వద్ద గల షెల్టర్ నుంచి బహిర్భూమికి వెళ్తున్న ఆలయ సేవకుడు దివిలి లోవరాజు(29)ను కూడా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు డ్రైవర్లు, ఆలయ సేవకుడు తీవ్ర గాయాలతో సంఘటనాస్థలం వద్దే మృతి చెందారు. ఈ ఘటనకు కారణమైన ఆర్టీసీ బస్సును డ్రైవర్ నిలుపుదల చేయకుండా రాజమహేంద్రవరం తీసుకువెళ్లిపోయాడు. బస్సులో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. నలుగురు వ్యక్తులు రహదారి చెంతనే మృత్యువాత చెందడంతో ఆ ప్రదేశమంతా రక్తపు మడుగులా మారింది. ప్రమాద విషయం తెలిసి పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమార్, ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం ఎస్‌ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్ కిషోర్, స్థానిక పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ సంఘటనపై పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి విచారణ నిర్వహించారు. నాలుగు మృతదేహాలను ఆటోలపై స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించి మృతుల బంధువులకు అప్పగించారు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో ఆర్టీసీ బస్సు డ్రైవర్

పాదాలమ్మ గుడి వద్ద నిర్లక్ష్యంగా బస్సు నడిపి నలుగురు మృతికి కారణమైన రాజమండ్రి ఆర్టీసీ డిపోకు చెందిన పిల్లా శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నలుగురు మృతి ఘటన జరిగినా బస్సు డ్రైవర్ పిల్లా శ్రీనివాస్ బస్సును రాజమహేంద్రవరానికి తీసుకువెళ్లిపోయాడు. దీంతో పోలీసులు అతడ్ని రాజమండ్రిలో అదుపులోకి తీసుకుని ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది.

మిన్నంటిన రోదనలు

పాదాలమ్మ తల్లి గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురు వ్యక్తుల కుటుంబీకుల రోదనలతో ప్రత్తిపాడు ఆసుపత్రి కన్నీటిసంద్రంగా మారింది. కుటుంబానికి ఆధారంగా ఉండే లారీడ్రైవర్ల జీవితాలు తెల్లవారుతూనే తెల్లారిపోవడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. బాపట్ల జిల్లా బల్లికురువు మండలం నక్కబొక్కలపాడు, రామాంజనేయపురం లారీ డ్రైవర్ల స్వగ్రామాలు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు బంధువులకు సమాచారం అందించడంతో సోమవారం మధ్యాహ్నానికి ప్రత్తిపాడు ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో స్థానికంగా ఉంటున్న దివిలి లోవరాజుది విశాఖపట్నం. ఆరేళ్లుగా స్థానిక పాదాలమ్మ గుడి వద్ద సేవకుడిగా ఉంటూ బహిర్భూమికి వెళ్తూ ఊహించని విధంగా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. లోవరాజు తల్లి సన్యాసమ్మ, తండ్రి త్రినాథ్, సోదరుడు శివాజీ, సోదరి రమ్యకృష్ణ విలపిస్తున్న కంటతడి పెట్టించింది. మృత్యువాతపడ్డ డ్రైవర్లలో దాసరి కిషోర్, దాసరి ప్రసాద్ అన్నదమ్ములు. వీరి అమ్మ, అక్క, తమ్ముడు కూడా సంవత్సర కాలంలోనే మృతి చెందారు. కిషోర్‌కు భార్య శ్యామల, కుమార్తె అక్షిత, కుమారుడు హర్ష ఉన్నారు. ప్రసాద్‌కు భార్య వరలక్ష్మి, కుమార్తెలు లక్ష్మి, కిరణాంజలి, లిఖిత, ప్రసన్న లక్ష్మి ఉన్నారు. బండి నాగయ్యకు భార్య లిల్లీ గ్రేస్, ఏడాదిన్నర కుమార్తె కోమలి, మరో 15రోజులు వయస్సు గల బాబు ఉన్నారు. నాగయ్య ఆకస్మిక మరణంతో అతడి కుటుంబీకులు ఆసుపత్రి వద్ద కుప్పకూలిపోయారు.



శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

చెట్టును ఢీకొన్న కారు

యువకుడి మృతి..డ్రైవర్‌కు గాయాలు

ఎటపాక, ఫిబ్రవరి 26: ప్రమాదవశాత్తు అదుపుతప్పి కారు చెట్టును ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, టేకులపల్లి గ్రామానికి చెందిన జాటోత్ శ్రీనివాస్ (23) తన కారులో డ్రైవర్‌తో మారేడుమిల్లి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో బాసవాగు మూలమలుపు వద్దకు రాగనే కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టుని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా, డ్రైవర్ స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో శ్రీనివాస్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28 నుంచి తెలుగు భాషా సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 26: తెలుగు భాషా సాహిత్యాలపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు ఈ నెల 28 నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని ఎస్‌వీకేపీ, డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో జరుగుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. నన్నయ వర్సిటీ అనుబంధ కళాశాలలో జరుగుతున్న ఈ సదస్సుకు యూనివర్సిటీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సమావేశాలకు 2వ అంతర్జాతీయ తెలుగు సమావేశాలుగా నామకరణం చేసినట్లు చెప్పారు. గత ఏడాది జరిగినఈ సమావేశాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇచ్చిందన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 26: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన గంధం రాజేష్‌కుమార్-దుర్గాదేవి దంపతులు రూ.5 లక్షలు విరాళం సమర్పించారు. వారికి ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందించారు. వివిధ సేవల ద్వారా సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.1,75,356 లభించినట్టు ఈవో భూపతి రాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

అంతర్వేది లక్ష్మీనరసింహుని హుండీల ఆదాయం రూ.41.23 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అంతర్వేది, ఫిబ్రవరి 26: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి హుండీ ఆదాయాలను సోమవారం లెక్కించారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.40,14,406, గుర్రాలక్కమ్మ వారి హుండీ ద్వారా రూ.80,044, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.29,432, మొత్తం హుండీల ఆదాయం రూ.41,23,882 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి హుండీ ద్వారా రూ.37,822 వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖాధికారి, అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, ఎంపీటీసీ భైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 26: ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ మెన్, ఉమెన్-2024 పోటీలు ఉత్కంఠభరితంగా ముగిసాయి. పురుషుల విభాగంలో విజేతల వివరాలను అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు సోమవారం వెల్లడించారు. స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన ఎ.బాలకృష్ణ, రన్నరప్‌గా అమలాపురానికి చెందిన ఎం.వీరేంద్ర నిలిచారు. ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా అమలాపురం, రన్నరప్‌గా రాజమహేంద్రవరం నిలిచాయి. 59 కిలోల విభాగంలో బి.యశ్వంత్ (అమలాపురం), వై.రాజు (రాజమహేంద్రవరం), ఎం.కిరణ్ (రాజమహేంద్రవరం), 66 కిలోల విభాగంలో ఎం.మధుసూదన్ (రాజమహేంద్రవరం), వి.లవకుమార్ (ముమ్మిడివరం), వై.పుత్రరాజు (రామచంద్రపురం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 74 కిలోల విభాగంలో ఎ.బాలకృష్ణ (రాజమహేంద్రవరం), పి.జోసఫ్ (రామచంద్రపురం), వి.మహేష్ (ముమ్మిడివరం), 83 కిలోల విభాగంలో ఎం.సాయి (ముమ్మిడివరం), ఎం.రాహుల్‌బాబు (అమలాపురం), ఎం.వెంకటేష్ (అమలాపురం), 93 కిలోల విభాగంలో ఎం.వీరేంద్ర (అమలాపురం), ఎస్.సాయి (అమలాపురం), పి.మోహన్ (ముమ్మిడివరం), 93 కిలోలు పైబడిన విభాగంలో వి.వంశీ (ముమ్మిడివరం), సీహెచ్ వెంకటేష్ (రాజమహేంద్రవరం), డి.వీరమణికంఠ (ముమ్మిడివరం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. మాస్టర్స్ విభాగంలో 40 నుంచి 50 ఏళ్లలోపు నిర్వహించిన పోటీల్లో డీఆర్కే నాగేశ్వరరావు (ద్రాక్షారామ), చీకురుమెల్లి కిరణ్‌కుమార్ (అమలాపురం), డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామ), 60 ఏళ్లలోపు విభాగంలో జీఎస్ఎన్ మూర్తి, ఏఎస్ సత్యనారాయణ, ఎల్ఎస్ఎన్ మూర్తి (అమలాపురం) వరుస స్థానాలు సాధించారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన డీవీ సత్యనారాయణ, దొమ్మేటి వెంకటరమణ, ఎంవీ సముద్రం, వి.నరేష్, జి.గణేష్‌బాబు, యు.లక్ష్మీనారాయణ, చిక్కం రాజబాబు, నార్ని శ్రీను న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. టీడీపీ యువ నాయకుడు గంధం పల్లంరాజుతో పాటు గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు, డాక్టర్ గంధం విశ్వనాథ్, జయన సత్తిరాజు విజేతలకు బహుమతులు, షీల్డులను సమకూర్చారు. డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో విజేతలకు వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ ఆధ్వర్యంలో ప్రముఖులు దున్నాల దుర్గ, నల్లా సంజయ్, ఆర్డీఎస్ ప్రసాద్, కల్వకొలను ఉమా, మోకా వెంకటసుబ్బారావు, ఆశెట్టి ఆదిబాబు బహుమతులు అందజేశారు.

బంగారు దొంగలను పట్టేశారు

సినీ ఫక్కీలో దొంగతనం.. కేసులో మొత్తం 12 మంది నిందితులు

ఐదు రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు

9 మంది అరెస్టు.. 3.50 కిలోల బంగారం రికవరీ



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులను మీడియాకు చూపిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కేటుగాళ్లు సినీ ఫక్కీలో భారీ దొంగతనం చేస్తే.. తూర్పుగోదావరి జిల్లా పోలీసులు తమదైన రూటులో వెళ్లి కేవలం ఐదు రోజుల్లో ఆటకట్టించారు. ఈ మేరకు ఎస్పీ జగదీశ్ వివరాలను వెల్లడించారు. భీమవరానికి చెందిన బాలు నాథూరామ్ బంగారం షాపుల నుంచి వచ్చే ఆర్డర్ల ప్రకారం ఆభరణాలను సరఫరా చేసే వ్యాపారం చేస్తున్నారు. ఈ నెల 21న తన కారులో ఆభరణాలు షాపులకు ఇవ్వడానికి దూబచర్ల, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం బయలు దేరారు. చీకటి పడుతున్న సమయంలో కొయ్యలగూడెం దాటిన తర్వాత ఇన్నోవాలో ఐదుగురు దుండగులు వచ్చి తాము ఇన్‌కంట్యాక్స్ అధికారులమంటూ నాథూరామ్‌ని ఆపారు. బాలును, డ్రైవరు సురేశ్‌ని తమ కారులో ఎక్కించుకున్నారు. ఐదుగురిలో ఇద్దరు దుండగులు నాథూరామ్ కారులో బయలుదేరారు. రాజమహేంద్రవరం దగ్గరలోని దివాన్ చెరువు, లాలాచెరువు ప్రాంతాలు తిప్పి నాలుగో వంతెన సమీపంలోని జీరో పాయింట్ వద్ద నాథూరాంను దించేసి ఆయన కారును అప్పగించి దుండగులు పరారయ్యారు. కారులోని 3.50 కిలోల ఆభరణాలు, రూ.5 లక్షల నగదు అపహరణకు గురైందని గమనించి నాథూరాం పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాలతో దోపిడీ నల్లజర్ల పోలీస్ స్టేషను పరిధిలో జరిగినట్టు గుర్తించి ఆ స్టేషనులో కేసు నమోదు చేశారు. ఎస్పీ జగదీశ్ స్వీయ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. దర్యాప్తులో కొందరు అనుమానస్పద వ్యక్తులు ఇన్నోవాలో విజయవాడ వైపు వెళ్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. కారులోని వాళ్లను ప్రశ్నించిన అనంతరం 12 మందిని నిందితులుగా గుర్తించామని ఎస్పీ వివరించారు. వీళ్లలో జంగారెడ్డిగూడెంకు చెందిన చలపాక వెంకటేశ్, మద్దిపాటి కల్యాణ్, కోడూరి రవితేజ, కోనా శ్రీనివాస్, వేముల మంజుబాబు, షేక్ నాగూర్ మీరావలి, వేముల మోహన్ సాయి, మోహన్ నారాయణ్ కుంబాకర్, పమిడిపల్లి బ్రహ్మాజీలను అరెస్టు చేశామన్నారు. వీరందరూ పాత నేరస్తులని, నగల వ్యాపారం చేసేవాళ్లు, తయారీ దారులు కూడా ఉన్నారన్నారు. పథకం ప్రకారం దోపిడీకి దిగారన్నారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. సుమారు రూ.2 కోట్ల విలువైన 181 బంగారు గొలుసులు, కరిగించిన బంగారు కడ్డీలు మొత్తం 3.50 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు, నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, నల్లజర్ల సీఐ కె.దుర్గాప్రసాద్, రాజమహేంద్రవరం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు కె.రజనీకుమార్, కె.విజయబాబు, ఉమామహేశ్వరరావు, దేవరపల్లి ఎస్ఐ కె.శ్రీహరి, టీవీ సురేశ్, ఐటీ కోర్ ఎస్ఐ ఎం.అయ్యప్పరెడ్డి తదితర సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

వారం రోజుల్లోగా ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి

లేకపోతే జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరం

పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అల్టిమేటం



విలేకర్లతో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 26: మత్స్యకార జాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వారం రోజుల్లోగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే ఫిషర్‌మెన్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని యానాం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అల్టిమేటం జారీ చేశారు. కాకినాడలోని కాస్మోపాలిటిన్ క్లబ్ హాల్‌లో సోమవారం ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కుల సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కృష్ణారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారంపూడి ఈ నెల 17న మాజీ ఎమ్మెల్యే కొండబాబును విమర్శిస్తూ మత్స్యకార జాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారన్నారు .అప్పటి నుంచి మత్స్యకారులు పలు విధాలుగా తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నా ద్వారంపూడి వైఖరిలో మార్పు రాలేదన్నారు. ద్వారంపూడి ఈ వ్యాఖ్యలు చేసి పది రోజులవుతున్నా ఇప్పటివరకు మత్స్యకార జాతికి క్షమాపణ చెప్పకపోవడం పట్ల ఆయన అహంకార వైఖరి అర్థమవుతోందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. ఎంఎస్ఎన్ చారిటీస్ విద్యాసంస్థలు, అంతర్వేది దేవాలయాలు కట్టించిన దాతలు నాయకర్, కృష్ణమ్మలు మత్స్యకార జాతికి చెందినవారేనని తెలుసుకోవాలన్నారు. మత్స్యకార నాయ కులు సైకం రాజశేఖర్, బర్రి ప్రసాద్ మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం కాకినాడలో మత్స్యకారుల సమావేశానికి ఆటంకాలు కలిగించి ద్వారంపూడి గడ్డపారతో తన గొయ్యి తానే తవ్వుకున్నాడని, ఇప్పుడు పూర్తిగా ఆ గొయ్యిలో కూరుకుపోయాడన్నారు. ఆయన ఓట్ల ప్రచారానికి వచ్చినప్పుడు మత్స్యకారులు ఇంటి తలుపులు వేసుకుని నిరసన తెలపాలన్నారు. గతంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను కూడా అవమానపరచిన నీచ చరిత్ర అతనికి ఉందని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బలసాడి ఇందిర, మత్స్యకార నాయకులు మల్లాడి రాజు, తుమ్మల సునీత, తుమ్మల రమేష్, కోలా ప్రసాదవర్మ, విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు, బొడ్డు సత్యనారాయణ, పినపోతు తాతారావు, మల్లాడి రాజేంద్రప్రసాద్, కర్రి చిట్టిబాబు, చోడిపల్లి సతీష్, బడే కృష్ణ, బాలిపల్లి రాజు, గంటా వెంకటలక్ష్మి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మత్స్యకార నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇరిపాకలో మహా రుద్రాభిషేకం ప్రారంభం



పీఠాధిపతి శివస్వామితో జ్యోతుల నెహ్రూ, వనమాడి

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 26: జగ్గంపేట మండలం ఇరిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకం కార్యక్రమాన్ని సోమవారం అమరావతికి చెందిన శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శివస్వామి ప్రారంభించారు. ముందుగా జ్యోతుల నెహ్రూమణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులతో పాటు 24జంటలు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పరిషత్ రక్షా బంధం, పంచగవ్య ప్రాసన, దీక్షా ధారణ, గోపూజ, వేద పారాయణం, యాగశాల ప్రవేశం మహాన్యాస పారాయణ జ్యోతిర్లింగాల ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన, లక్ష్మీగణపతి హోమం నిర్వహించి, సాయంత్రం సౌరాష్ట్ర సోమనాదేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శైవక్షేత్ర పీఠాధిపతి శివ స్వామి ఈ మహా కుంభాభిషేకాన్ని నిర్వహించి భక్తులకు ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ ఇంతటి మహత్తర కార్యక్రమం నిర్వహించాలంటే ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలన్నారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ 11 రోజుల పాటు ఈ మహాకుంభాభిషేకం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కోటి మట్టి శివలింగాలకు భక్తులు తమ స్వహస్తాలతో అభిషేకం చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎంసీ హరీష్ బాలయోగి, చిక్కాల రామచంద్రరావు, వనమాడి కొండబాబు, కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, అడపా తాతాజీ, జిల్లాలోని, నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

అమృత్ భారత్ పథకంతో రాజమండ్రి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన రాజమండ్రి రైల్వే స్టేషన్ రూపురేఖలను సమూలంగా మార్చేందుకు అమృత్ భారత్ పథకానికి ఎంపిక చేసిన ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీ భరత్‌రామ్ చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌ని అధునాతనంగా తీర్చిదిద్దే పనులకు ప్రధాని మోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం కోసం రైల్వే అధికారులు రైల్వే స్టేషనులో ప్రత్యేక వేదిక, స్ర్కీన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను ఆధునీకీకరించే దిశగా ప్రధాని మోదీ చర్యలు చేపట్టడం స్వాగతనీయమన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.270 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఫైవ్‌స్టార్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ రైల్వే స్టేషనుగా మారబోతోందన్నారు. గోదావరిపై మరో వంతెనకు రైల్వే వద్ద ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. విశాఖ-విజయవాడ నడుమ మూడో లైను వేస్తున్నారని, నాలుగోలైను ఆవశ్యకత కూడా ఉందన్నారు. వికసిత్ భారత్, వికసిత్ అమృత్ అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ సీఐ విజయ్‌శంకర్, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏడీ ఆర్ఎం డి.శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఇన్‌చార్జి డి.ప్రసాద్, సమన్వయకర్త సీసీఐ కల్యాణ్ కుమార్, ఎస్ఎంఆర్ రంగనాథ్, ఐవోడబ్ల్యూ ప్రసాద్, సీటీఐ చంద్రమౌళి, ఎస్ఎస్ఈ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో వైభవంగా శ్రీపుష్పోత్సవం



ద్రాక్షారామ: ఫిబ్రవరి 26: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7.05 భీమేశ్వరుని శ్రీపుష్పోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణ మూర్తులను పుష్పాలు, చందన, కర్పూరాలతో అలంకరించారు. అనంతరం తూగుటుయ్యాలపై ఉంచి ఊయలాడించారు. పూజాదికాలు ఆస్థాన బ్రహ్మ దేవులపల్లి ఫణిరామకృష్ణ, అర్చకస్వాములు, వేదపండితులు నిర్వహించారు. అనంతరం పలువురు దంపతులకు దంపత తాంబూలాలు అందజేశారు. ఈవో పి.టి.వి సత్యనారాయణ, ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంపూర్ణ విద్య అందించే విద్యా విధానం అవసరం

ఆలిండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ (అప్పా) మహాసభల్లో వక్తలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 26: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలని, ప్రతి విద్యార్థికి సంపూర్ణ విద్య అందేలా విద్యా విధానాన్ని తీర్చిదిద్దాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆలిండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ (అప్పా) 3వ రాష్ట్ర మహాసభ సోమవారం స్థానిక పిల్లా మరియమ్మ ప్రాంగణంలో విజయవంతంగా జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ, మాజీ శాసనమండలి సభ్యురాలు అంగులూరి లక్ష్మీశివకుమారి, పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, ఆంధ్ర మాలమహానాడు అధ్యక్షుడు ఎస్.కొండబాబు హాజరయ్యారు. విద్య-వైద్య రంగాలు పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విద్యార్థులకు అన్ని వసతులు పూర్తి స్థాయిలో కల్పించి విద్యను సంపూర్ణంగా ఉచితంగా అందించడంతో పాటు సన్న బియ్యంతో ఆహారం, కాస్మెటిక్స్ అందించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం డీఎస్సీ ద్వారా శాశ్వత ఉపాధ్యాయులను ప్రతీ స్కూల్‌లో నియమించాలన్నారు. అనంతరం డాక్టర్ పిల్లా చంద్రం నూతన అధ్యక్షునిగా 41 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ అధ్యక్షుడు పిల్లి శివకుమార్, గిరిజన హక్కుల సాధన సంఘం కన్వీనర్ బి.విప్లవకుమార్, కెవీపీఎస్ జిల్లా నాయకులు కె.సింహాచలం, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ నాయకులు గుబ్బల ఆదినారాయణ, ఏఐసీసీటీయూ రాష్ట్ర కార్యదర్శి గొడుగు సత్యనారాయణ, కనకరాజు, తణుకుల యోహాన్ పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

ఐటీడీఏ స్పందనకు 40 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం, ఫిబ్రవరి 26: స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఏపీవో(జీ)తో కలిసి స్పందనలో వచ్చిన 40 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ వై.రామవరం ఎగువ ప్రాంతం గుర్తేడు, దారగడ్డ, పాతకోట పంచాయతీలలో మినీ రైస్‌మిల్లులు ఏర్పాటు చేయాలని అర్జీలు అందాయన్నారు. అలాగే ఉమ్మెత్తలో గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, పిడతమామిడి గ్రామంలో సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేయాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని, భూసమస్యలు పరిష్కరించాలని, రంప శివాలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలు గ్రామస్తులే నిర్వహించుకునేలా అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో డీడీ అబుసలాం, ఎస్డీసీ జాన్‌రాజ్, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఈవో మల్లేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూ కార్యాలయంలో గంజాయి

ఆధిపత్య పోరుతో కేసులో ఇరికిద్దామనే కుట్ర
యూనియన్ ఆఫీస్‌లో గంజాయి పెట్టిన ప్రత్యర్థి వర్గం
నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



వివరాలు చెబుతున్న పోలీసులు

మోతుగూడెం, ఫిబ్రవరి 26: రెండు కార్మిక యూనియన్ల మధ్య విభేదాలు కుట్రలు పన్నే స్థాయికి వెళ్లిపోయాయి. ఒక యూనియన్ నాయకుడిని గంజాయి కేసులో ఇరికించాలని ప్లాన్ వేసిన మరో నాయకుడు ప్లాన్ వికటించి తానే బుక్కయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఐఎన్‌టీయూసీ 327 సంఘం కార్యాలయంలో సోమవారం 5.3 కిలోల గంజాయిని మోతుగూడెం పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేశారు. 1104 యూనియన్‌కు చెందిన సూర్నిడి నాయుడుకు, 327 యూనియన్‌కు చెందిన పి.ఆనందబాబుకు మధ్య వివాదాలు ఉన్నాయి. చాలా కాలం నుంచి ఎత్తులుపైఎత్తులతో ఒకరిపై ఒకరు కక్ష తీర్చుకుంటున్నారు. అలాగే 327 యూనియన్‌కు చెందిన కాళ్ల రామకృష్ణకు కూడా ఆనంద్‌తో పాటు అతని అనుచరుల మీద పగ ఉంది. దీంతో నాయుడు, బండారు రాజేష్, కాళ్ల రామకృష్ణ, ఆనంద్ మీద పగ తీర్చుకోవడానికి 327 ఆఫీసులో గంజాయి పెట్టినట్టు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చి కేసులో ఇరికించాలని పన్నాగం పన్నారు. ఈ క్రమంలో ఈనెల 11న కాళ్ల రామకృష్ణ 327 యూనియన్ ఆఫీసు తాళాలు పి.శ్రీను అనే వ్యక్తి దగ్గర తీసుకుని బండారు రాజేష్‌కి ఇచ్చారు. బండారు రాజేష్ ఆ తాళాలను నాయుడుకు ఇచ్చాడు. అతను పొల్లూరుకు చెందిన రవి దగ్గర నుంచి ఐదు కిలోల గంజాయిని రూ.4 వేలకు కొని దాన్ని 327 యూనియన్ ఆఫీసులో పెట్టించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తర్వాత పోలీసులు వెళ్లి గంజాయిని గుర్తించి యూనియన్ నాయకులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. అయితే గంజాయికి తమకు ఎటువంటి సంబంధం లేదని యూనియన్ నాయకులు చెప్పడంతో పోలీసులు మరో కోణంలో విచారణ నిర్వహించి కుట్రను బయటపెట్టారు. ఈ కేసులో సూర్నిడి నాయుడు, బండారు రాజేష్, కాళ్ల రామకృష్ణ, పుట్టపల్లి రవిని అరెస్టు చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

దేవీపట్నం,ఫిబ్రవరి 26: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని టీడీపీ నేత మాగాపు బాబూరావు, గోళ్ల చంటి అన్నారు. మహానాడులో చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. మండలంలో పరసనపాడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సోమవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మచ్చు నాగేశ్వరరావు, పళ్లపాటి నాగేశ్వరరావు, పెరుగాని ఏసు, శివ, పాతాళ పండు, కారం పోసమ్మ, మల్లేష్, కర్రి రాజీవ్, పూనెం బాబూరావు, కుంజం కల్యాణి పాల్గొన్నారు.

కూనవరం మండల బీజేపీ అధ్యక్షుడిగా పవన్

కూనవరం,ఫిబ్రవరి26: కూనవరం మండల బీజేపీ అధ్యక్షుడిగా కరకా పవన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పాయం వెంకయ్య మాట్లాడుతూ పార్టీలో యువకుడైన పవన్ పార్టీ ఎదుగుదలకు ఎంతగానో కృషి చేశారని ఆ మేరకు పవన్‌ను నూతన అధ్యక్షుడిగా నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నోముల రామారావు, నోముల సత్యనారాయణ, దారయ్య పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వంతల రాజేశ్వరి

వై.రామవరం,ఫిబ్రవరి26: వై.రామవరం మండలంలోని ఎగువ ప్రాంతానికి చెందిన పాతకోట పంచాయతీలో దాదాపు 350 కుటుంబాల వరకు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం మండలంలోని లోతట్టు ప్రాంతం పాతకోట పంచాయతీ కొప్పులకోట, బురదకోట, గంగనూరు, జమ్మగూడ, గుడ్లవాడ, కొత్తపాకలు, శనగనూరు, కర్నూతులు, తుమ్మిచేలు, ఓకొప్పులకోట, డి.కొప్పులకోట గ్రామాలకు చెందిన వైసీపీ ఉపసర్పంచ్ బట్టా బుజ్జిరెడ్డి, మాజీ సర్పంచ్ సాదల బాబూరావు, మరిగెల బంతిరాజు, కోన్ల శివశంకర్‌రెడ్డి, కోన్ల సాగర్, మాజీ వార్డు మెంబర్ జర్తా బాలయ్యతో సహా సుమారు 350 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరగా మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల నుంచి వైసీపీ పాలనలో విసుగు చెంది కనీసం పంచాయతీ ఉప సర్పంచ్ అన్న గౌరవం కూడా లేకుండా అవమానిస్తున్న వైసీపీ నాయకుల ఆగడాలు చూడలేక తెలుగుదేశం పార్టీలో చేరామని నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి, వై.రామవరం మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వీకా నరసన్నదొర, పార్టీ అధ్యక్షుడు పల్లాల వెంకటరమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కురుసం సత్యనారాయణదొర, కడబాల గంగాధర్ పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలతో డీడీ సమావేశం

రంపచోడవరం, ఫిబ్రవరి 26: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేసే ఉపాధ్యాయులకు అప్‌గ్రేడింగ్ ప్రమోషన్లు కల్పించేందుకు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు అబుసలాం సోమవారం కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ నిర్వహణపై తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎల్.వేణుగోపాల్, బి.కృష్ణ, జి.నాగభూషణం, వై.విల్సన్, ఆదిరెడ్డి, మహేష్, బి.మంగిరెడ్డి, కత్తుల ఆదిరెడ్డి పాల్గొన్నారు.

‘స్పందన’కు 30 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26: రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ దినేష్‌కుమార్ నిర్వహించిన స్పందనకు 30 అర్జీలు వచ్చాయి. ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీల విషయంలో జవాబుదారీ తనంతో వ్యవహరించి సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

డమ్మీ పట్టాల తయారీపై చర్యలు చేపట్టాలి

» రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు



వెలగపూడిలోని అడిషనల్ సీఈవో కోటేశ్వరరావుకు ఫిర్యాదు అందజేస్తున్న నల్లమిల్లి

అనపర్తి, ఫిబ్రవరి 26: రెండు రోజుల క్రితం అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో వెలుగు చూసిన డమ్మీ ఇళ్ల పట్టాలపై చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం వెలగపూడిలోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో అడిషనల్ చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి కోటేశ్వరరావుకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్‌తో కలిసి ఫిర్యాదు చేశారు. శనివారం అనపర్తి తహసీల్దార్ కార్యాలయంలో వెలుగు చూసిన డమ్మీ పట్టాల తయారీపై రామకృష్ణారెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ స్పందన కార్యాలయంలో ఫిర్యాదు అందజేసి అక్కడి నుంచి వెలగపూడిలోని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వైసీపీ ప్రభుత్వం భూ సేకరణ జరుగకుండానే పట్టాలు తయారు చేస్తున్నారని, కొన్ని గ్రామాల్లో పంపిణీ కూడా చేశారన్నారు. శనివారం అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో డీటీ టేబుల్‌పై డమ్మీ పట్టాలు ఉండడంతో ఆయనను వివరణ కోరగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో కలెక్టర్‌కు, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశానన్నారు. అలాగే బిక్కవోలులో బదిలీ అయిన తహశీల్దార్ పాత తేదీలతో సంతకాలు చేయడంపై తాను చేసిన ఫిర్యాదుపై జిల్లా అధికారులు తాత్సారం చేస్తున్న అంశాన్ని కూడా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్టు రామకృష్ణారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెంట టీడీపీ నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, సత్తి దేవదానరెడ్డి తదితరులున్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ బూత్ కన్వీనర్లు

అనపర్తి మండలం కొప్పవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ బూత్ కన్వీనర్లు సోమవారం రామవరంలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వైసీపీ బూత్ కన్వీనర్లుగా పనిచేస్తున్న కొమరపు దుర్గాప్రసాద్, మరక సోంబాబు, మేడిశెట్టి సత్యనారాయణ, రావు సత్యనారాయణలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నేతలు చేస్తున్న కక్ష పూరిత రాజకీయాలపై విరక్తి చెందిన అనేక మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, తేనెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన సభను విజయవంతం చేయాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్



కోరుకొండ సమావేశంలో మాట్లాడుతున్న జవహర్

కోరుకొండ, ఫిబ్రవరి 26: ఈనెల 28న తాడేపల్లిగూడెంలో జరగబోయే టీడీపీ-జనసేన బహిరంగ సభను జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బూరుగుపూడి గేటు వద్ద పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంట్ జోన్-2 కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న సుజల రంగారావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో జరిగే టీడీపీ -జనసేన ఉమ్మడి సభకు అత్యధికంగా రెండు పార్టీల శ్రేణులతోపాటు, ప్రజలు తరలిరావాలని జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రెండు పార్టీలు కలసి పనిచేయడంతోపాటు, సమర్థులైన నేతలను అభ్యర్థులుగా ప్రకటించడంతో వైసీపీ వెన్నులో వణుకు పుట్టిందన్నారు. జాతీయపార్టీలతో సమన్వయం చేసుకుంటూ వైసీపీ పాలనకు అంతం పలకాలని సంకల్పించిన పవన్‌పై వైసీపీ అవాకులుచవాకులు పేలుతుందని, తమను ఎదుర్కొనే ధైర్యం లేక వైసీపీ ఇలా వ్యవహరిస్తోందని అనుశ్రీ ఆరోపించారు.

అవకాశం ఇవ్వండి.. సమస్యలు పరిష్కరిస్తా

» టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



1వ డివిజన్‌లో ప్రజలతో ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26: నాకొక్క అవకాశం ఇవ్వండి రాజమహేంద్రవరంలో ప్రజలు ఐదేళ్లుగా పడుతున్న బాధలన్నీ తీరుస్తానని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 1వ డివిజన్‌లో సోమవారం నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణి పర్యవేక్షణలో మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. శెట్టిబలిజ నాయకుడు గుత్తుల వెంకటనారాయణ రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆదిరెడ్డి వాసు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, ఉప్పులూరి జానకిరామయ్య, కట్టా సత్యనారాయణ, రుద్ర, పుల్లూరి శ్రీను, కుంచే ఏసుబాబు పాల్గొన్నారు.

ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గెలిపించుకోవాలి: బుడ్డిగ

టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ గెలిపించుకోవాలని టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలంతా టీడీపీకి వెన్నెముక అని, బీసీలంతా శ్రీనివాస్‌ను అభిమానిస్తారన్నారు. వెనుకబడిన వర్గా అభ్యున్నతి కోసం టీడీపీ-జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. టీడీపీ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం అభివృద్ధి చెందాలంటే ఆదిరెడ్డి వాసును గెలిపించాలన్నారు. సమావేశంలో టీడీపీ నగర కార్యదర్శి కిలపర్తి శ్రీనివాస్, ఉర్లంకల లోకేష్, ద్వారా పార్వతిసుందరి, లాల్ ఖాన్, బుడ్డిగ రవి, కందికొండ అనంత్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో నేడు ఓపెన్ ల్యాబ్ డే

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓపెన్ ల్యాబ్ డే నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలోని అతి ప్రాచీనమైన లైబ్రరీ, ఫిజిక్స్ విభాగంలోని పురావస్తు సంగ్రహశాల (అంటిక్ ఎక్విప్‌మెంట్ ల్యాబ్), జువాలజీ మ్యూజియం, బొటానికల్ గార్డెన్, జియాలజీ మ్యూజియం, కెమిస్ట్రీ ల్యాబ్స్, బయోటెక్నాలజీ ల్యాబ్, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ లేబోరేటరీ వంటి అనేక ప్రయోగశాలలను నగరంలోని విద్యార్థినీ విద్యార్థులు, సాధారణ ప్రజల కోసం తెరచి ఉంచుతామని తెలిపారు. వీటిలోని పరికరాలు ఎలా పనిచేస్తాయో అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు వివరిస్తారని పేర్కొన్నారు.

పల్లి జాన్ మృతిపై విచారణ జరపాలని వినతి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26: రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడు గ్రామానికి చెందిన పల్లి జాన్ మృతిపై సీబీఐతో విచారణ జరపాలని జాన్ కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో చైత్రవర్షిణికి వినతిపత్రం అందజేశారు. మృతుడు జాన్ తల్లిదండ్రులు పల్లి కుమారి, పల్లి చిన్ని మాట్లాడుతూ తమ కుమారుడు జాన్‌ను ఒక పథకం ప్రకారం హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెంది ఏడాది గడుస్తున్నా పోలీసు దర్యాప్తు నత్తనడకన సాగుతున్నదని వాస్తవాలు మరుగు పరిచేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ధర్నాలో మృతుడి తల్లిదండ్రులు, సోదరుడు విజయ్, దళిత సంఘాల నాయకులు ముచ్చకర్ల సత్యనారాయణ, పల్లి వెంకటేశ్వర్లు, చైతన్యమహిళా సంఘం నాయకులు కప్పల సునీత పాల్గొన్నారు.

శ్రీగౌతమిలో సైన్సు క్వెస్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా శ్రీగౌతమి విద్యాసంస్థ మూడు రోజుల పాటు 7 నుంచి 9వ తరగతి విద్యార్థులతో సైన్సు క్వెస్టు నిర్వహిస్తున్నట్టు కరెస్పాండెంట్ సుంకర రవికుమార్ తెలిపారు. సైన్సు సిద్ధాంతాలు, వర్కింగ్ మోడల్స్, ఇల్యూజన్స్ సిములేషన్స్ తదితర కాన్సెప్టులతో విద్యార్థుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. సైన్సు కెస్ట్ సోమవారం ప్రారంభించామని.. 28 వరకూ కొనసాగుతుందని తెలిపారు.కార్యక్రమంలో డైరెక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

‘జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడాలి’

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26: జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని టీఎన్‌టీయూసీ రాష్ట్రనేత, తాడేపల్లిగూడెం టీడీపీ పరిశీలకులు నక్కా చిట్టిబాబు అన్నారు. రాజమహేంద్రవరం బైపాస్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షస పాలన నుంచి విముక్తి కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, విశ్వబ్రాహ్మణులంతా సంఘటితమై జగన్‌ను ఇంటికి పంపించాలన్నారు. వచ్చే ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో పాలవలస వీరభద్రం, పమిడిపల్లి కోటేశ్వరరావు, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు గండేబత్తుల శ్యామ్, వీరమల్ల సత్తిబాబు, దర్నాలకోట వెంకటేశ్వరరావు, అపలాబత్తుల సత్తిబాబు, చించినాడ తాతాజీ పాల్గొన్నారు.

వెంకటాపురంలో ‘భవిష్యత్తుకు గ్యారెంటీ’

రంగంపేట, ఫిబ్రవరి 26: మండలంలోని వెంకటాపురంలో గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మి చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల ద్వారా పొందే లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు పంచారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, పూసల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక



బిక్కవోలు, ఫిబ్రవరి 26: మండలంలోని కాపవరంలో వైసీపీకి చెందిన సత్యంశెట్టి సత్తిబాబు, కుంతం శ్రీను, చిక్కాల వీరబాబు, పూసల సంతోష్ అనుచరులు వంద మంది కార్యకర్తలు జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు కొట్టు నరేష్ ఆధ్వర్యంలో సోమవారం జనసేన పార్టీలో చేరారు. వీరికి నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పనిచేసి ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇందల వీరబాబు, రావాడ నాగు, వీరాస్వామి, ప్రసాద్‌రెడ్డి, కామాకు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ, గౌడల ఆత్మీయ సమావేశం

బిక్కవోలు, ఫిబ్రవరి 26: మండలంలోని ఆర్ఎస్.పేటలో ఆదివారం రాత్రి శెట్టిబలిజ, గౌడల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలను సత్కరించారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యామన దుర్గాభవాని, ఏఎంసీ ఛైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కొమరిపాలెం సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

కడియం, ఫిబ్రవరి 26: ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఒంగోలు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కుప్పం ప్రసాద్.. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వారణాసి శ్రీనివాసగుప్త ఆహ్వానం మేరకు దుళ్ల ఆర్యవైశ్య సంక్షేమ భవనానికి విచ్చేసారు. గ్రామంలోని కోదండ రామస్వామిని దర్శించుకున్నారు. ఆయనను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఒబిలిశెట్టి కాశీ, తమ్మన సత్తిబాబు, కంచర్ల మూర్తి, కొరుప్రోలు ప్రసాద్; ఒబిలిశెట్టి బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై ఓరియెంటేషన్ ప్రోగ్రాం

కడియం, ఫిబ్రవరి 26: వచ్చే నెల 3న జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, వైద్యాధికారులు డా. ఎన్.జెస్సీప్రియ, డా. ఎం.మణిజ్యోత్స్న ఆధ్వర్యంలో ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. 0 నుంచి 5 ఏళ్ళ వయసున్న పిల్లలకు పోలియో చుక్కలు వేసే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడుతూ అన్నిశాఖలు సమన్వయం చేసుకుని పల్స్‌పోలియో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు ఎం.రామకృష్ణ, ఎండీ ఆలీబేగ్, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, బి.ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనపర్తి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అనపర్తి, ఫిబ్రవరి 26: రైల్వే స్టేషన్ల అభివృద్ధి చేసేందుకు కేంద్ర పభుత్వం అమృత భారత్ పథకంలో భాగంగా సుమారు రూ.20.70 కోట్లతో అనపర్తి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్చువల్ విధానంలో శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్‌లో ఏసీఎం రవివర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్, రైల్వే అండర్‌పాస్ రోడ్డు పనులకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అలాగే రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల శంకుస్థాపన సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నిలుపుదల, అండర్‌పాస్ రోడ్డు నిర్మాణం, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ వంటి అంశాలపై ఏసీఎంకు ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, బీజేపీ ఇన్‌చార్జి శివరామకృష్ణంరాజు, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అదనపు పోషకంగా మునగాకు పొడి: కలెక్టర్



ఐరన్ ప్లస్ పోస్టర్‌ని చూపుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి, 26(ఆంధ్రజ్యోతి): కౌమార దశలో బాలికల్లో రక్తహీనత తలెత్తకుండా నివారించే క్రమంలో ‘సామాజిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం 2.2 వెర్షన్’ ద్వారా బాలికలకు ఓఎన్జీసీ మునగాకుపొడి పంపిణీ చేయడం ప్రశంసనీయమని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. గురుకుల గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ‘ప్రాజెక్టు ఐరన్ ప్లస్’ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రక్తహీనత వల్ల కళ్లుతిరిగి పడిపోవడం వంటి రుగ్మతలకు గురవుతారన్నారు. ఆహారం ద్వారా ఐరన్ పోషకాలు అందుతున్నాయో లేదో నిర్ధారణ చేసుకోవాలన్నారు. నేటి బాలికలు రేపటి ఆరోగ్యవంతమైన సమాజానికి వెన్నెముక వంటి వారని ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ్ పేర్కొన్నారు. విద్యార్థులు చేసిన గిరిజన నృత్యాలు ఆకర్షించాయి. కార్యక్రమంలో జీఎం సంతన్‌దాస్, డాక్టర్ ఎస్.వసుంధర తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 26: జీడిమామిడి గింజలకు ప్రభుత్వం గిట్టుబాటుధర కల్పించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దొడ్డా అర్జున్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జీడిమామిడి గింజలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా తాము ఈ విషయమై ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయిందని వాపోయారు. మరికొద్ది రోజుల్లో జీడిగింజలు సీజన్ ప్రారంభం కాబోతోందని, వెంటనే గిట్టుబాటుధర ప్రకటించాలని కోరారు. 80 కిలోల జీడిగింజల బస్తాకు కనీసం రూ.10 వేలు గిట్టుబాటు ధరగా ప్రకటించాలన్నారు.

త్రిమూర్తులుస్వామిని దర్శించుకున్న బీవీఆర్

రాజానగరం, ఫిబ్రవరి 26: మండలంలో నరేంద్రపురంలోని త్రిమూర్తులు స్వామి 77వ కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి స్వామివారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా రాజరాజేశ్వరిదేవి శిఖర ప్రతిష్ఠాపన

రాజానగరం, ఫిబ్రవరి 26: రాజానగరంలోని శివాలయ ప్రాంగణంలోని శ్రీరాజరాజేశ్వరి దేవి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. పునఃపూజలు, పూర్ణాహుతి, మహా సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం శిఖర ప్రతిష్ఠాపన జరిపించారు. గోమాత దర్శనం అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రముఖ వ్యాపారవేత్త, దాత కుందుల బలరామకృష్ణ దంపతులతో వేదపండితులు ప్రతిష్ఠ క్రతువు జరిపించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకుడు సోము వీర్రాజు, జక్కంపూడి విజయలక్ష్మితో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు జనసేన పాదయాత్ర

కడియం, ఫిబ్రవరి 26: ఈ నెల 27న కడియం దేవీచౌక్ సెంటర్ నుంచి రాజమహేంద్రవరం డీలక్స్ సెంటర్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు జనసేన పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం కడియపులంకలో జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా రాజమహేంద్రవరం రూరల్ సీటు జనసేనకు కేటాయించాలని కోరుతూ పాదయాత్ర చేపడుతున్నట్టు చెప్పారు. సమావేశంలో జనసేన మండలాధ్యక్షుడు ముద్రగడ జమీ, గట్టి నర్సయ్య, వైస్ ఎంపీపీ పంతం గణపతి, ఎంపీటీసీలు గొల్లపల్లి శ్రీను, నాగిరెడ్డి రామకృష్ణ, నాయకులు ఆదిమూలం సాయిబాబా, మార్గాని ఏడుకొండలు, పాటంశెట్టి రవి పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ, ఫిబ్రవరి 26: ప్రతిగ్రామంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అంతర్గత రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో రూ.2.60 కోట్ల పీఎంజీఎస్వై నిధులతో నిర్మించనున్న బుచ్చింపేట-మునగాల రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో నిర్లక్ష్యానికి గురైన కనెక్టవిటీ రోడ్లను నిర్మిస్తామని, దీనిలో భాగంగా ఈ రోడ్డుపనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, నక్కా రాంబాబు, బొరుసు బద్రి, కడియాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

శుభకరన్‌సింగ్‌కు నివాళులు

కడియం, ఫిబ్రవరి 26: మూడు వ్యవసాయ నల్ల చట్టాల రద్దు కోరుతూ జిల్లా సరిహద్దుల్లో పునఃప్రారంభించిన రైతాంగం ఉద్యమంపై కాల్పులు జరిపి రైతు పోరాట యోధుడు శుభకరన్‌సింగ్‌ను కాల్చి చంపి, 135మంది రైతులను గాయపరిచిన మోదీ ప్రభుత్వం ఫాసిస్టు నిర్బంధాన్ని ఖండిస్తూ అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో దుళ్ల ఎర్రకాలనీలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకుడు వెంటపల్లి భీమశంకరం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, రైతుకూలీ సంఘం నాయకులు అలజంగి గడ్డియ్య, గెద్దాడ తాతబ్బాయి, పితాని ధనలక్ష్మీ, వి.చిన్నమ్ములు, గుదిరెడ్ల నర్సమ్మ, పసుపులేటి లక్ష్మి పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఊరుపేరు భైరవకోన
సూర్యామినీ	: ముఖ్యగమనిక, క్రాక్
సూర్యాప్యాలస్	: భ్రమయుగం
స్వామి	: ఈగల్
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: ఊరుపేరు భైరవకోన
అశోక	: ------
ఊర్వశి	: సిద్ధార్థ్‌రాయ్
రంభ	: యాత్ర-2, రాజధాని ఫైల్స్
మేనక	: మస్త్ షేడ్స్ ఉన్నాయిరా, లాల్‌సలామ్
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: సుందరం మాస్టర్
వీఎస్ మహాల్(నామవరం)	: ఊరుపేరు భైరవకోన
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: భ్రమయుగం
వెంకటసూర్య(కడియం)	: సిద్ధార్థ్‌రాయ్
సత్యగౌరి (అనపర్తి)	: హనుమాన్
సూర్యశ్రీ (అనపర్తి)	: ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ఊరుపేరు భైరవకోన
రామకృష్ణ(కోరుకొండ)	: ఊరుపేరు భైరవకోన
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఊరుపేరు భైరవకోన
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఊరుపేరు భైరవకోన
లలితామహల్(రంపచోడవరం)	: ఊరుపేరు భైరవకోన
నవయుగ(చింతూరు)	: సిద్ధార్థ్‌రాయ్





జంబూపట్నంలో మూతపడిన ఈఎస్‌సీ జీడి పప్పు ఫ్యాక్టరీ

రైల్వే స్టేషన్ల అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది.. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌ని అధునాతనంగా తీర్చిదిద్దే పనులకు ప్రధాని మోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.. రూ.270 కోట్లతో రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయనున్నారు. అదే విధంగా నిడదవోలు మండలం శెట్టిపేట వద్ద రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనపర్తి రైల్వే స్టేషన్‌ను రూ.20.70 కోట్లతో అభివృద్ధి చేసే పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైల్వే పనులు వేగవంతం కానున్నాయి.. - వివరాలు 8లో

బంగారం దొంగలను పట్టేశారు..



పోలీసులు వేగంగా స్పందించారు.. ఇన్‌కంట్యాక్స్ అధికారులమంటూ నమ్మించి బంగారం వ్యాపారి నుంచి రూ.2 కోట్ల విలువైన 3.5 కేజీల బంగారం చోరీ చేసిన కేసును కేవలం ఐదు రోజుల్లోనే ఛేదించారు.. 12 మంది నిందితులను గుర్తించి 9 మందిని అరెస్టు చేశారు. - వివరాలు 7లో

పారిశ్రామిక.. పతనం



కొవ్వూరు మండలం విజ్జేశ్వరం వద్ద మూతపడిన జీటీపీఎస్

పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇదీ ఎన్నికలకు ముందు సీఎం జగన్ మాట.. ఇంకేంటి మన గ్రామాల్లో పరిశ్రమ ఉంటే మనకే ఉద్యోగాలనుకున్నారంతా.. ఓట్లేసి గెలిపించారు.. తీరా చూస్తే ఈ ఐదేళ్లలో ఎన్నడూ లేనంతా పారిశ్రామిక పతనం ఆరంభమైంది.. స్థానికులకు 75 శాతం ఉద్యోగాల మాట అటుంచి.. పాలకుల బెదిరింపులు.. పరిశ్రమలకు ముడి సరుకు సరఫరాలో ఇబ్బందులతో ఉన్న పరిశ్రమలనే మూసేశారు.. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు 10 పరిశ్రమల పైనే మూతపడి.. వేలాది మంది ఉపాధి కోల్పోయారంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పాతవి మూత..కొత్తవి లేవు..

- జిల్లాలో మూతపడిన పరిశ్రమలు
- జీటీపీఎస్.. జీఎంఆర్ లాకౌట్
- తెరుచుకోని చాగల్లు షుగర్స్
- భయపడిన ఈఎస్‌సీ కంపెనీ
- కార్న్ ఫౌడర్ ఫ్యాక్టరీ లేఆఫ్
- రోడ్డున పడిన వేలాది మంది
- ఉద్యోగాల్లేక విలవిల
- స్థానికులకు 75శాతం ఉద్యోగాలెక్కడ
- ఉన్నవి పీకేసిన వైసీపీ ప్రభుత్వం
- జిల్లాలో పెరిగిన నిరుద్యోగిత

జిల్లాలో కొత్త పరిశ్రమల మాట దేవుడెరుగు.. వేలాది మందికి ఉపాధినిచ్చే పాత పరిశ్రమలు వరుసగా మూత పడుతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సుమారు 10 పరిశ్రమలు పైనే మూతపడగా వేలాది మంది ఉపాధి కోల్పోయారు.ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రస్తుతం బతుకుజీవుడా అంటూ ఏదో ఒక పని చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం సంక్షేమం పేరుతో పథకాలెన్ని ఇచ్చినా ఉపాధి లేక కుటుంబాలు గడవడమే కష్టతరంగా మారింది.. అయినా అక్కడ పాలకులు కానీ.. ఉన్నతాధికారులు కానీ ఉపాధి కోల్పోయిన కుటుంబాలను పట్టించుకున్న దాఖలాలు లేవు.

గొప్పలు చెబుతున్న ప్రభుత్వం

జిల్లాలో పరిశ్రమల సంగతి ఇలా ఉంటే ప్రభుత్వం మాత్రం ఎంతో సాధించినట్టు చెప్పడం గమనార్హం. జిల్లాలో 2023-24లోనే ఏకంగా 6,748 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో 1109 కోట్ల పెట్టుబడి పెట్టడం వల్ల 25,222 మందికి ఉపాధి కల్పించినట్టు చెబుతున్నారు. జిల్లాలో ఇంకా రూ.3760 కోట్ల పెట్టుబడితో భారీ పరిశ్రమలు రాబోతున్నాయని వాటి ద్వారా 5,910 మందికి ఉపాధి లభిస్తుందని అంటున్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ (జీఐఎస్)లో 116 పరిశ్రమల స్థాపనకు దరఖాస్తులు వచ్చాయన్నారు.కానీ అవి ఏ దశలో ఉన్నాయో, అవి ఏంటో స్పష్టమైన సమాచారం లేదు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద 378 యూనిట్లు నెలకొల్పినట్టు చెబుతున్నారు. బిక్కవోలులో బిర్లా సంస్థ ఆధ్వర్యంలో ఉప్పు ఆధారిత పరిశ్రమను విస్తరణ చేయనున్నట్టు చెబుతున్నారు. గోకవరంలో ఇథనాల్ ఉత్పత్తి పరిశ్రమకు సీఎం జగన్ స్వయంగా శంకుస్థాపన చేశారు. కానీ అది ఇంకా పూర్తి కాలేదు. కొవ్వూరు మండలం పరిధిలో నిర్మించనున్న రిలయన్స్ బయోగ్యాస్ ఇండస్ట్రీకి ఇటీవల శంకుస్థాపన చేశారు. కానీ దీనికి సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని అన్ని ఏర్పాట్లు చేశారు. విచిత్రమేమిటంటే ఈ సంస్థకు చెందిన యాజమాన్యం నుంచి ముఖ్యులెవరూ హాజరు కాలేదు. దీనితో మంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

కొత్త పరిశ్రమల్లేవ్...

పూర్వ నుంచి ఇప్పటి వరకూ జిల్లాలో 37 భారీ పరిశ్రమలు.. రూ.6798.65 కోట్ల పెట్టుబడులు ఉన్నాయనేది పాత లెక్క. ఆయా కంపెనీల్లో 17546 మంది ఉపాధి పొందుతున్నారని చెబుతున్నారు. వీటిలో ప్రస్తుతం పదుల సంఖ్యలో కంపెనీలు మూతపడ్డాయి. సీఎం జగన్ గోవకవరం మండలంలోని గుమ్మలదొడ్డిలో శంకుస్థాపన చేసిన అసాగో ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ ఇంకా ఉత్పత్తిలోకి రాలేదు. రూ.260 కోట్ల పెట్టుబడి పెడుతున్నారని 210 మందికి ఉద్యోగాలు వస్తాయని చెబుతున్నారు.కానీ ఇది ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేకపోతున్నారు.పంగిడిలో రూ.1350 కోట్లతో త్రివేణి రిన్యూవేబుల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సోలార్ గ్లాస్‌లు తయారు చేస్తామని, ఇక్కడ 2,400 మందికి ఉపాధి ఉంటుందని చెప్పారు. ఇది ఇంకా ఉత్పత్తిలోకి రాలేదు. ఆంధ్రపేపరు మిల్లు విస్తరణకు విశాఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఒప్పందం జరిగింది.కానీ రూ.2వేల కోట్లతో విస్తరించి, 2300 ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇంకా ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ రాలేదు. పెరవలిలో రవలి స్పిన్నర్స్‌ను విస్తరిస్తామని,రూ.150 కోట్ల పెట్టుబడి ఉందని, 1000 మంది ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇంకా ప్రారంభం కాలేదు. 2022 మార్చి నుంచి ఈ ఏడాది జనవరి వరకూ 22,132 మంది ఎంటర్‌ప్రైజెస్ రూ. 2718 కోట్ల పెట్టుబడి తో 66,520 మందికి ఉపాధి కల్పించినట్టు ప్రచారం చేస్తున్నారు.కానీ వాస్తవ రూపం వేరేగా ఉంది. అనేక పరిశ్రమలు కుదేలైపోతున్నాయి.

స్థానికులకు ఉద్యోగాలేవీ?

పరిశ్రమ స్థాపించినప్పుడు ఎంతోగొప్పగా ప్రచారం చేసే అధికారులు మూత పడితే దానికి సరైన కారణాలు చెప్పడంలేదు. పైగా ఉద్యోగుల ఉపాధి సంగతిని పట్టించుకోవడంలేదు. బిక్కవోలు ఉప్పు ఆధారిత పరిశ్రమను బిర్లా కంపెనీ నెలకొల్పింది. ఇక్కడ స్థానికుల కంటే ఇతర్లే ఎక్కువ అనే ప్రచారం ఉంది. మిగతా పరిశ్రమలలో అదే పరిస్థితి. సీఎం జగన్ ఇచ్చిన 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే హామీ ఎక్కడా నెరవేరడం లేదు. నైపుణ్య కార్మికుల పేరుతో దగా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పరిశ్రమ ఉన్న ప్రాంతంలో కింద స్థాయి పను లకు మాత్రమే ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో నిరుద్యోగులు ఉద్యోగాల్లేక ఇబ్బందులు పడుతున్నారు.

పరిశ్రమలు మూతపడ్డాయిలా..

చాలా కాలంగా జీడిపప్పు పరిశ్రమలో ఉన్న కేరళకు చెందిన ఈఎస్‌సీ కంపెనీ సుమారు ఆరు నెలల కిందట తన ఫ్యాక్టరీలన్నీ మూసివేసింది. దివాన్‌చెరువు, జం బూపట్నం, కోటికేశ్వరంతో పాటు ఇతర జిల్లాల్లో ఉన్న అనేక ఫ్యాక్టరీలు మూతపడ్డాయి.ఈ ఫ్యాక్టరీల్లో మహిళలు ఎక్కువగా పనిచేసేవారు. ప్రభుత్వ పెద్దలు కంపెనీ యాజమాన్యాన్ని బెదిరించడంతో వారి కోరికలు తీర్చ లేక రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న వీరి ఫ్యాక్టరీలన్నీ మూసేసుకున్నట్టు ఉపాధి కోల్పోయిన ఉద్యోగులు చెబుతున్నారు. ఈ కంపెనీ స్థానికంగా జీడిపిక్కలు కొని ప్రాసెస్ చేసి పప్పును ఎక్కువగా విదేశాలకు సరఫరా చేసేది. ఆయా పరిశ్రమలు ఆకస్మికంగా మూతపడడంతో అనేక కుటుంబాలు కనీస పోషణ పోయింది. వీరిని కనీసం పలకరించేవారు లేరు.

చాగల్లులోని జైపూర్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని ఎన్నికల ముందు జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయినా కనీసం పట్టించు కోవడంలేదు. బ్యాంక్ గొడవలు, ఇతర కారణాలతో సీఐడీ విచారణ వల్ల ఫ్యాక్టరీ ఇబ్బందుల్లో పడిన సంగతి తెలి సిందే. సుమారు 2500 మంది వరకూ ఉద్యోగుల కుటుం బాలు రోడ్డున పడ్డాయి.

వేమగిరిలో జీఎంఆర్ విద్యుత్ ప్రాజెక్టు మూత పడింది. అనేక మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వానికి సంబంధించిన జీవీకే పవర్ ప్రాజెక్టు మూత పడింది. ఇక్కడ 200 మంది వరకూ ఉద్యోగులు ఉం డేవారు. సడన్‌గా మూసివేయడంతో ప్రత్యక్షంగా 200 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రస్తుతం కేవలం 25 మంది విద్యుత్‌శాఖ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.విద్యుదుత్పత్తిలేదు.గ్యాస్ కొరత కారణంగా విద్యుత్ పరిశ్రమలు మూతపడిన సంగతి తెలిసిందే. సిరామిక్స్ ఇండస్ట్రీస్, పలు రైసు మిల్లులు మూత పడ్డాయి.

బిక్కవోలు మండలంలోని బలభద్రపురం శివారులో ఉన్న కార్న్ ఫౌడర్ ఫ్యాక్టరీ యాజమాన్యం మూడు నెలల నుంచి లేఆఫ్ ప్రకటించింది. ఉద్యోగులను విధులకు రానీయడం లేదు.ఈ ఫ్యాక్టరీ సుమారు 20 ఏళ్ల కిందట నుంచి ఉంది. ఆకస్మికంగా ఉద్యోగులను తొలగించడంతో ఇక్కడ ఆందోళన మొదలైంది. ఇక్కడ మొక్కజొన్నతో ఫౌడర్ తయారు చేసేవారు. రోజుకు 10 టన్నుల వరకూ ఉత్పత్తి అయ్యేది.మొదట ఆంధ్రులే పరిశ్రమ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గుజరాత్‌కు చెందిన వారు నడుపుతున్నారు.వేరే చోట్ల యూనిట్లు పెట్టుకోవడం కోసం ఇక్కడ మూసేస్తున్నట్టు అధికారుల చెబుతున్న కథనం.గుజరాత్ నుంచి తక్కువ జీతాలకు కూలీలను రప్పించుకుంటున్నారనే వాదన ఉంది.



మూతపడిన జీటీపీఎస్



పల్స్ పోలియో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

3న పల్స్ పోలియో విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26 : జిల్లాను పోలియోరహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి.. మార్చి 3న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. రాజమహేంద్రవరం (బొమ్మూరు)లోని కలెక్టర్ స్పందన హాల్లో పల్స్‌పోలియో కార్యక్రమంపై సోమవారం జరిగిన జిల్లా టాస్కుఫోర్సు కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు మొత్తం 1,90,479 మందికీ పోలియో చుక్కలు వేయడానికి 1060 పోలియో బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బస్టాండు, రైల్వే స్టేషన్లు వంటి ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేయడానికి 60 ట్రాన్సిట్ టీంలు, 47 మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. 465 హైరిస్క్ ప్రాంతాల్లో మొబైల్ టీంల ద్వారా పోలియో చుక్కలు వేయిస్తామన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ రాజకుమారి, డీఆర్‌వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26: విద్యార్థులు ఆర్థిక అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ మాధవీలత అన్నారు. ఆర్థిక అక్షరాసత్య వారోత్సవాలు పోస్టర్‌ను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల వచ్చే నెల ఒకటో తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు.కార్యక్రమంలో జేసీ తేజ్ భరత్ , ఎల్‌డిఎం డివిప్రసాద్, డీఆర్‌వో నరసింహులు పాల్గొన్నారు.



లెక్చర్ సిరీస్ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్‌జేడీ కృష్ణ

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలి

లెక్చర్ సిరీస్ ప్రారంభంలో ఆర్‌జేడీ కృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26 : విద్యార్థులు బయో టెక్నాలజీ రంగంలో పరిశోధనలవైపు ఆకర్షితులు కావాలని ఉన్నత విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ కృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం పాపులర్ లెక్చర్ సిరీస్ అడ్వాన్సెస్ ఇన్ బయోటెక్నానికల్స్ ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకూ పాపులర్ లెక్చర్ సిరీస్ జరుగుతుందన్నారు. తొలిరోజున కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ వై.సురేష్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మైక్రోబియల్ అండ్ ప్లాంట్ బయోపెస్టిఫైడ్స్ ఫర్ క్రాప్స్ ఇంప్రూవ్‌మెంట్ అనే అంశంపై వివరించారు. సమన్వయకర్తగా అనూష వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్శిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయనిర్మల, బయోటెక్నాలజీ విభాగాధిపతి బి.నాగేశ్వరి, కళాశాల అధ్యాపకులు ఏ.అన్నపూర్ణ, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చూస్తుండగానే..దగ్ధమైన ఐచర్ వ్యాన్



కొవ్వూరు,ఫిబ్రవరి 26 : చూస్తుండగానే వ్యాన్ ఒక్కసారిగా దగ్ధమైంది. జంగారెడ్డిగూడెంనకు చెందిన డ్రైవర్ కం ఓనర్ వేములపల్లి రాజు ఐచర్ వ్యాన్‌లో ఐరన్ బాక్సులు లోడ్ వేసుకుని హైదరాబాద్ నుంచి తుని బయలు దేరాడు. సోమవారం మధ్యాహ్నం 12-15 గంటల సమయంలో నేషనల్ హైవేపై కొవ్వూరు మండలం కాపవరం వద్ద రోడ్డు పక్కకు తీసి వాహన ఇంజన్ ఆన్‌లో ఉంచి బహిర్భూమికి వెళ్లాడు. ఒక్కసారిగా వ్యాన్ నుంచి మంటల ఎగసి పడడంతో దారిన వెళ్ళేవారు కేకలు పెట్టారు. అప్పటికే కేబిన్ నుంచి మంటలు వచ్చి వ్యాన్ మొత్తం తగలబడి పోయింది. స్థానికులు బకెట్లతో నీళ్లు తెచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు ఫైర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. దీంతో వ్యాన్ యజమాని రాజు లబోదిబోమన్నాడు.

రెండో జాబితాపై కసరత్తు

జిల్లాలో టిక్కెట్ల టెన్షన్

- రాజమహేంద్రవరం రూరల్‌కు గోరంట్ల
- నిడదవోలుకు కందుల దుర్గేష్
- 4 సీట్ల ప్రకటనపై ఉత్కంఠ
- త్వరలో అధికారిక ప్రకటన

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

త్వరలో టీడీపీ- జనసేన రెండో జాబితా ప్రకటించడానికి కసరత్తు ఆరంభమైంది. త్వరలో ఈ జాబితాను ప్రకటించనుంది. ఇప్పటికే జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలకు ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీ నుంచి రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలను ఉమ్మడి అభ్యర్థులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.రాజానగరం నుంచి జనసేన నేత బత్తుల బలరామకృష్ణ అభ్యర్థిగా ఖరారయ్యారు.వీరి పేర్లు అధికారికంగా కూడా ప్రకటించాల్సి ఉంది. ఇక రాజమహేంద్రవరం రూరల్ నుంచి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ పేర్లనే ఖాయంచేసినట్టు సమాచారం. త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో జనసేన కార్యకర్తల్లోనూ, నిడదవోలు టీడీపీ వర్గాల్లో ఏర్పడిన ఆందోళనను తగ్గించే బాధ్యత కూడా అధిష్ఠానమే తీసుకోవడం గమనార్హం. కొద్దిరోజుల్లో జిల్లాలో సమస్యలన్నీ సద్దుమణుగుతాయని రెండు పార్టీల నేతలు చెబుతున్నారు. ఇక గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు పేరు కూడా ఖరారైనట్టే. అది కూడా అధిష్ఠానం ప్రకటించాల్సి ఉంది. కొవ్వూరు నియోజకవర్గంలో అభ్యర్థి ఎవరనే దానిపై స్పష్టత లేదు. ఎంపీ అభ్యర్థి విషయంలో కూడా స్పష్టత రావాల్సి ఉంది. జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్రను చల్లబరిచే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.ప్రస్తుతం జిల్లాలోని టీడీపీ-జనసేన నేతలంతా ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో జరిగే ఉమ్మడి బహిరంగ సభపై దృష్టి పెట్టారు.



నిడదవోలులో మాట్లాడుతున్న పట్టణాధ్యక్షుడు వెంకటేశ్వరరావు

నిడదవోలు సీటు శేషారావుకే కేటాయించాలి

టీడీపీ నాయకుల డిమాండ్

నిడదవోలు, ఫిబ్రవరి 26 : నిడదవోలు నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా విజయం సాధించే సత్తా ఉన్న బూరుగుపల్లి శేషారావుకే టికెట్ ఖరారు చేస్తారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. నిడదవోలు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహిం చారు. నియోజకవర్గంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కాకుండా లేని సమయంలో కూడా ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. ఉం డ్రాజవరం మండల అధ్యక్షుడు సింహాద్రి రామ కృష్ణ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్య కర్తల అభిప్రాయానికి టీడీపీ అధినాయకత్వం విలువ ఇస్తుందన్నారు.తప్పనిసరిగా శేషారావుకే టిక్కెట్ వస్తుందన్నారు. కార్యక్రమంలో అతికాల రామకృష్ణ మ్మ,భూపతి రవివర్మ, తిరుపతి సత్యనారాయణ, వెలగన సూర్యారావు, పాల్గొన్నారు.

నిడదవోలు టిక్కెట్ ఎవరికిచ్చినా గెలిపించుకుందాం : కుందుల



పెరవలి : నిడదవోలు నియోజకవర్గంలో టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఎవరిని నియమించినా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని నియోజకవర్గ టీడీపీ నాయకుడు కుందుల సత్యనారాయణ అన్నారు.టీడీపీ, జనసేనల ఆధ్వర్యం లో రాబోయే ఎన్నికల్లో గెలుపు సాధించి చంద్రబాబు నాయుడిని సీఎం చేయడమే అందరి లక్ష్యంగా ఉండాలన్నారు. వర్గ విభేధాలు విడనాడి కలిసికట్టుగా పని చేయాలని సూచించారు.మార్చి 1 నుంచి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు.

3వ రోజుకు పాటంశెట్టి దీక్ష

గోకవరం, ఫిబ్రవరి 26 : గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాటంశెట్టి సూర్యచంద్ర దంపతులు చేపట్టిన నిరసన దీక్ష సోమవారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. జగ్గంపేట టీడీపీ అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూను ప్రకటించడం పట్ల ఆయన అసంతృప్తికి గురైన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో సూర్యచంద్ర దంపతులు అంతిమ ఆమరణ నిరహారదీక్షకు దిగారు. కాగా అచ్యుతాపురంలోని కనకదుర్గమ్మ గుడిలో దీక్షకు దిగిన సూర్యచంద్ర దంపతులు సోమవారం గుడి నుంచి బయటకు వచ్చి సమీపంలోని రావిచెట్టు కింద ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఈ మేరకు టీడీపీ, వైసీపీ నాయకులు పరామర్శించారు.



ఆలయం వెలుపల చెట్టు కింద దీక్ష కొనసాగిస్తున్న పాటంశెట్టి దంపతులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ఎన్నికల కమిషన్ దృష్టికి అనపర్తి అక్రమాలు

- డమ్మీ పట్టాల విచారణపై కలెక్టర్‌ను కలిసిన నల్లమిల్లి
- అనపర్తి అధికారులకు వత్తాసు పలకడంపై ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ఫిబ్రవరి 26 : అక్రమంగా డమ్మీ పట్టాలు తయారు చేస్తున్న అధికారులకు వత్తాసుపలుకున్న కలెక్టర్ , జేసీ వంటి వారితో వచ్చే ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగవని అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం జిల్లాకలెక్టర్‌లో సోమవారం ఆయన తెలుగు రైతులతో కలిసి కలెక్టర్ డాక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్‌లను కలిసి అనపర్తిలో డమ్మీపట్టాల విచారణ జాప్యంపై ప్రశ్నించారు. దీంతో కలెక్టర్, జేసీలకు రామకృష్ణారెడ్డికి మధ్య వాదన జరిగింది. డమ్మీపట్టాలు చేసిన అధికారులను సమర్థిస్తున్నారంటూ రామకృష్ణారెడ్డి అధికారులను నిలదీశారు. అనంతరం వినతి పత్రం అందించారు. రామకృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలో భూసేకరణ జరగకుండా తహశీల్దార్ కార్యాలయంలో డమ్మీపట్టాలు 2వేలు తయారు చేయడాన్ని గుర్తించామన్నారు. అనపర్తిలో జరుగుతున్న అక్రమాలపై ప్రశ్నిస్తే జాయింట్ కలెక్టర్ ఎవార్డు పాస్ చేశామంటున్నారన్నారు. భూసేకరణ జరగని దానికి ఏ విధంగా ఎవార్డు ఇస్తారని ప్రశ్నించారు. బిక్కవోలులో పోసిబాబు అనే అధికారి బదిలీపై వెళ్లి మళ్లీ వచ్చి 120 పట్టాలు వెనుక తేదీతో వేస్తే దానిపై తాను ఫిర్యాదు చేస్తే ఆర్‌డీవో విచారణకు ఆదేశించారన్నారు.ఈ రోజుకు 14 రోజులు గడిచిన విచారణ లేదన్నారు. కేవలం వారం రోజుల ఎన్నికల శిక్షణ సాకుతో విచారణ చేయకుండా కాలయాపన చేసి సమర్థించుకుంటున్నారన్నారు. ఈ విషయలన్నింటిని ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన స్పందనలో కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, డీఆర్‌వో నరసింహులు 177 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించారు.

కలెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం మేరకే పట్టాలు సిద్ధం

అనపర్తి,ఫిబ్రవరి 26 : కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు అనపర్తి మండలంలో పెండింగ్‌లో ఉన్న స్థల లబ్ధిదారులకు పట్టాలు తయారు చేస్తున్నామని అనపర్తి తహశీల్దార్ నాగరాజు పేర్కొన్నారు. డమ్మీ పట్టాల అంశంపై వివరణ ఇస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. 2019లో మండలంలో 5409 మంది లబ్ధిదారులను గుర్తించామని వారిలో 2350 మందికి గతంలో పట్టాలు అందించామని మిగిలిన 3059 మంది లబ్ధిదారులకు భూసేకరణ చేశామన్నారు. ప్రభుత్వం వారి నుంచి డబ్బులు వస్తాయని వాటికి సంబంధించిన నివేశన స్థల పట్టాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ కార్యాలయం నుండి వచ్చిన సమాచారం మేరకు పట్టాలు తయారు చేస్తున్నామన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

టీడీపీ-జనసేన సభను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 26: ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో జరిగే టీడీపీ- జనసేన బహిరంగ సభను విజయవంతం చేయాలని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. తాళ్లపూడిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు మాట్లాడుతూ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో కొరాటు వెంకట్రావు, ఘైనం వెంకట్, సిద్దా దుర్గారావు, కైగాల శ్రీనివాస్, మద్దిపాటి ప్రకాశం, తిగిరిపల్లి గోపి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

'స్పందన'కు 11 ఫిర్యాదులు

కొవ్వూరు, ఫిబ్రవరి 26: డివిజనల్ స్పందనలో 11 ఫిర్యాదులు స్వీకరించినట్టు ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి కె.రవివిక్రమ్ తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ 2, ఎంపీడీవో 1, రెవెన్యూ 3, మున్సిపాల్టీ 1, ఆర్అండ్‌బీ 1, డీఆర్‌డీఏ 1, ఎక్సైజ్ 1, లిఫ్ట్ఇరిగేషన్‌కు సంబంధించి 1 దరఖాస్తును స్వీకరించామన్నారు. స్పందన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొవ్వూరులో 'వలంటీర్లకు వందనం'



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు, ఫిబ్రవరి 26: వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో పట్టణ, మండలానికి సంబంధించి సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రతి సంక్షేమ పథకం వలంటీర్ల ద్వారానే అందించినట్టు చెప్పారు. భవిష్యత్‌లో వలంటీర్లను పర్మినెంటు చేసే అవకాశం ఉందన్నారు. నాలుగేళ్లలో వలంటీర్ల కోసం రూ.1200 కోట్లు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, రుత్తల భాస్కరరావు, కమిషనర్ బి.శ్రీకాంత్, ఎంపీడీవో కె.సుశీల పాల్గొన్నారు. అనంతరం పశివేదల గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

ఉండ్రాజవరం: మండలంలోని చివటం లో మండలంలోని వలంటీర్లకు నిర్వహించిన వందన కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు విచ్చేసి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య, జిల్లా అగ్రిబోర్డు ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, వైస్ ఎంపీపీలు చెట్టే నవీన్, ఎస్.సరోజ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జాన్‌మరియా చర్చి నిర్మాణానికి భూమిపూజ

దేవరపల్లి, ఫిబ్రవరి 26: మండలంలోని యర్నగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న పునీత జాన్‌మరియా చర్చ్‌కి సోమవారం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు భూమిపూజ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిర్మలగిరి మేరీ మాత ఆలయానికి 12కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం నిర్మించడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు, పాదర్ డానియేల్, సర్పంచ్ బొంతా భరత్‌బాబు, గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, స్థానిక నాయకులు కనకరాజు, దొరబాబు పాల్గొన్నారు.

ప్రక్కిలంకలో శ్రీచక్ర సహిత చండీహోమం



చండీ యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 26: మండలంలోని ప్రక్కిలంక గ్రామ దేవత మావూళ్లమ్మ ఆలయంలో శ్రీచక్ర సహిత చండీ హోమం నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం గ్రామంలోని మహిళలు ఆలయం నుంచి పూర్ణ కలశాలతో అఖండ గోదావరి వద్దకు వెళ్లి నదీ జలాలతో పండితుల వేద మంత్రాలు, సన్నాయిమేళాల నడుమ పురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. అనంతరం అమ్మవారికి పంచాభిషేకాలు, ధూపదీప నైవేద్యాలతో చండీహోమం చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులతోపాటు కమిటీ నిర్వాహకులు ముళ్ల మల్లిబాబు, పెంటా శ్రీను, ఖండవల్లి రామచంద్రం, వీరవల్లి వీరన్న, బాణాల కుమార్, చమకూరి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆర్థిక సాయం

గోపాలపురం, ఫిబ్రవరి 26: మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన గంగులకుర్తి రమేష్‌ను జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు సోమవారం పరామర్శించారు. రమేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పార్టీ శ్రేణుల సమాచారంతో ఆయన చిట్యాలలోని రమేష్ ఇంటికి వెళ్లి పరామర్శించి, రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. భవిష్యత్‌లో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పోలనాటి రాజేంద్ర, పోసిన గణపతి, సూర్య భగవాన్, పగడాల మల్లిబాబు, కృష్ణబాబు, గండ్రోతు ఉమ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు

పెరవలి, ఫిబ్రవరి 26: అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. 28 రోజులకు గాను రూ.1,95,719 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎం.రాధాకృష్ణ తెలిపారు. పసలపూడి గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి మహేశ్వరరావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించామన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో నేడు ఓపెన్ ల్యాబ్ డే

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓపెన్ ల్యాబ్ డే నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని అతి ప్రాచీనమైన లైబ్రరీ, ఫిజిక్స్ విభాగంలోని పురావస్తు సంగ్రహశాల (ఆంటిక్ ఎక్విప్‌మెంట్ ల్యాబ్), జువాలజీ మ్యూజియం, బొటానికల్ గార్డెన్, జియాలజీ మ్యూజియం, కెమిస్ట్రీ ల్యాబ్స్, బయోటెక్నాలజీ ల్యాబ్, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ లేబోరేటరీ వంటి అనేక ప్రయోగశాలలను నగరంలోని విద్యార్థినీ విద్యార్థులు, సాధారణ ప్రజల కోసం తెరచి ఉంచుతామని తెలిపారు. వీటిలోని పరికరాలు ఎలా పనిచేస్తాయో అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు వివరిస్తారని పేర్కొన్నారు.

శ్రీగౌతమిలో సైన్సు క్వెస్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా శ్రీగౌతమి విద్యాసంస్థ మూడు రోజుల పాటు 7 నుంచి 9వ తరగతి విద్యార్థులతో సైన్సు క్వెస్టు నిర్వహిస్తున్నట్టు కరెస్పాండెంట్ సుంకర రవికుమార్ తెలిపారు. సైన్సు సిద్ధాంతాలు, వర్కింగ్ మోడల్స్, ఇల్యూజన్స్, సిములేషన్స్ తదితర కాన్సెప్టలతో విద్యార్థుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. సైన్సు కెస్ట్ సోమవారం ప్రారంభించామని.. 28 వరకూ కొనసాగుతుందని తెలిపారు.కార్యక్రమంలో డైరెక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

3న పల్స్ పోలియో

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 26: మండలంలో మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరంలో సోమవారం జరిగిన మండలస్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 36 పల్స్‌పోలియో బూత్‌ల ద్వారా ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ నవీన్‌కుమార్, ఏఈ దొరబాబు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన విజయానికి కృషి

▸ టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు



నల్లజర్ల సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి

కొవ్వూరు, ఫిబ్రవరి 26: టీడీపీ, జనసేన నాయకులంతా కలిసి పనిచేసి ఎన్నికల్లో విజయం సాధిద్దామని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో జరగనున్న ఎన్నికల శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు మాట్లాడుతూ సీటు ఎవరికి వచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేసి ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషిచేద్దామని, రాష్ట్రంలో రాక్షసపాలనను అంతమొందించి జగన్‌ను ఇంటికి పంపించాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు గొర్రెల శ్రీధర్, వట్టికూటి వెంకటేశ్వరరావు, చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్, కలగర సుబ్బారావు, జనసేన నాయకులు దేగల రాము, సుంకర సత్తిబాబు, గంగుమళ్ల స్వామి పాల్గొన్నారు.



కొవ్వూరు సమావేశంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు

రంగారావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో జరిగే టీడీపీ -జనసేన ఉమ్మడి సభకు అత్యధికంగా రెండు పార్టీల శ్రేణులతోపాటు, ప్రజలు తరలిరావాలని జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం రెండు పార్టీలు కలిసి పనిచేయడంతో పాటు, సమర్థులైన నేతలను అభ్యర్థులుగా ప్రకటిస్తున్నాయన్నారు.

టీడీపీ - జనసేన సభను విజయవంతం చేయాలి

కోరుకొండ, ఫిబ్రవరి 26: ఈనెల 28న తాడేపల్లిగూడెంలో జరగబోయే టీడీపీ-జనసేన బహిరంగ సభను జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బూరుగుపూడి గేటు వద్ద పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంట్ జోన్-2 కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న సుజల

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం మాలలకే ఇవ్వాలి

పార్టీ ఎస్సీసెల్ గోపాలపురం అధ్యక్షుడు చింతాల దాసు

దేవరపల్లి, ఫిబ్రవరి 26: రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం మాలలకే ఇవ్వాలని పార్టీ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చింతాల దాసు కోరారు. మండలంలోని పల్లంట్లలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోపాలపురంలో 40 ఏళ్లుగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాదిగలకే ఇస్తున్నారని, ఈ నియోజకవర్గంలో 46వేల ఓట్లు మాలలవే ఉన్నాయని అధిక సంఖ్యలో ఉన్న తమకే సీటు కేటాయించాలన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న తలారి వెంకట్రావు(మాల) 40వేల మెజార్టీతో గెలిచారని టీడీపీలో టిక్కెట్టు ఇస్తే మెజారిటీతో గెలుపొందుతారన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కొవ్వూరు, గోపాలపురం నియోజవర్గాల సీట్లు ఈసారి ఎస్సీ మాలలకు ఇవ్వాలని కోరామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటసుబ్బారావు, హేమంత్, పాముల బాబ్జీ, గాంధీ, మరపట్ల శ్రీను పాల్గొన్నారు.



దేవరపల్లి: పల్లంట్లలో మాట్లాడుతున్న చింతాల దాసు

వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మద్యం సరఫరా

టీడీపీ గోపాలపురం ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు

నల్లజర్ల, ఫిబ్రవరి 26: మద్యనిషేదం చేసి ఓట్లు అడుగుతానన్న హామీపై జగన్‌రెడ్డి మాటతప్పి మడమ తిప్పాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. నల్లజర్లలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన జనసేన-టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మద్యం సరఫరా అవుతుందన్నారు. జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 4లక్షల బెల్టు షాపులు ఉన్నాయన్నారు. మద్యం తాగిన వారిలో 35 లక్షల మంది ఆరోగ్యాలు దెబ్బతిని ఆసుపత్రుల పాలయ్యారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, కండెపు వెంకటరత్నం, నిమ్మలపూడి ప్రసాద్, షేక్ మీరా సాహెబ్, దేవరపల్లి అధ్యక్షుడు అనిల్, ద్వారకాతిరుమల లంకా సత్యనారాయణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రైల్వే ఆధునీకరణతో మేలు

▸ కాల్ధరిలో రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభంలో బీజేపీ నాయకులు



నిడదవోలు: శెట్టిపేటలో అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో ప్రముఖులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 26: కేంద్ర ప్రభుత్వం రైల్వే అభివృద్ధి ద్వారా ప్రజలకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నట్టు పలువురు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కాల్ధరి గ్రామంలో ఇటీవల నిర్మించిన అండర్ రైల్వే బ్రిడ్జిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే ఆదునీకరణతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, కేంద్రం ప్రజాసంక్షేమానికి రైల్వేశాఖ ద్వారా పనులు చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, బంటుమల్లి వెంకటేశ్వరరావు, ఆర్.ధననరసింహారావు, ఎస్.లక్ష్మీనారాయణ, కె.రామారావు, సర్పంచ్ సీహెచ్ కుమారి, సీహెచ్ వెంకట్రావు రైల్వే అధికారులు కె.ధర్మేంద్ర, నందీశ్వరరావు, ప్రభాకరవర్మ, సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

శెట్టిపేట రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి జాతికి అంకితం

నిడదవోలు, ఫిబ్రవరి 26: నిడదవోలు మండలం శెట్టిపేట గ్రామంలో నిర్మించిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ అమృత భారత్‌లో భాగంగా శెట్టిపేట రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిని ప్రధాని మోదీ జాతికి అంకితం చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైల్వే అధికార్లు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం: కాల్ధరిలో రైల్వే అండర్‌బ్రిడ్జిని ప్రారంభిస్తున్న దృశ్యం

అదనపు పోషకంగా మునగాకు పొడి : కలెక్టర్



ఐరన్ ప్లస్ పోస్టర్‌ని చూపుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి, 26(ఆంధ్రజ్యోతి): కౌమార దశలో బాలికల్లో రక్తహీనత తలెత్తకుండా నివారించే క్రమంలో 'సామాజిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం 2.2 వెర్షన్' ద్వారా బాలికలకు ఓఎన్జీసీ మునగాకుపొడి పంపిణీ చేయడం ప్రశంసనీయమని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. గురుకుల గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'ప్రాజెక్టు ఐరన్ ప్లస్' కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రక్తహీనత వల్ల కళ్లుతిరిగి పడిపోవడం వంటి రుగ్మతలకు గురవుతారన్నారు. ఆహారం ద్వారా ఐరన్ పోషకాలు అందుతున్నాయో లేదో నిర్ధారణ చేసుకోవాలన్నారు. నేటి బాలికలు రేపటి ఆరోగ్యవంతమైన సమాజానికి వెన్నెముక వంటి వారని ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ్ పేర్కొన్నారు. విద్యార్థులు చేసిన గిరిజన నృత్యాలు ఆకర్షించాయి. కార్యక్రమంలో జీఎం సంతన్‌దాస్, డాక్టర్ ఎన్.వసుందర తదితరులు పాల్గొన్నారు.

అధునాతనంగా రాజమండ్రి రైల్వే స్టేషన్

▸ రూ.270 కోట్ల పనులు.. మారనున్న రూపురేఖలు

▸ ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన రాజమండ్రి రైల్వే స్టేషన్ రూపురేఖలను అధునాతనంగా తీర్చిదిద్దడానికి అమృత్ భారత్ పథకంలో ఎంపిక చేసిన ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌ని అధునాతనంగా తీర్చిదిద్దే పనులకు ప్రధాని మోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం కోసం రైల్వే అధికారులు రైల్వే స్టేషనులో ప్రత్యేక వేదిక, స్క్రీన్ తదితర ఏర్పాట్లను చేశారు. మంత్రి మాట్లాడుతూ రాజమండ్రి రైల్వే స్టేషనును మరింతగా ఆదునీకరించే దిశగా ప్రధాని మోదీ చర్యలు చేపట్టడం స్వాగతనీయమన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.270 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఫైవ్‌స్టార్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ రైల్వే స్టేషనుగా మారబోతోందన్నారు. గోదావరిపై మరో వంతెనకు రైల్వే వద్ద ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. విశాఖ-విజయవాడ నడుమ మూడో లైను వేస్తున్నారని, నాలుగోలైను అవశ్యకత కూడా ఉందన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ కోట్లాది మంది ప్రయాణించే రైల్వే వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ప్రధాని మోదీ లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతు న్నారని.. ఇది గిన్నీస్ బుక్‌లో నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు వికసిత్ భారత్, వికసిత్ అమృత్ అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లోని విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ సీఐ విజయ్‌శంకర్, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీ ఆర్ఎం డి.శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఇన్‌చార్జి డి.ప్రసాద్, సమన్వయ కర్త సీసీఐ కల్యాణ్‌కుమార్, ఎస్ఎంఆర్ రంగనాథ్, ఐవోడబ్ల్యు ప్రసాద్, సీటీఐ చంద్రమౌళి, ఎస్ఎస్ఈ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దొడ్డా అర్జున్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 26: జీడిమామిడి గింజలకు ప్రభుత్వం గిట్టుబాటుధర కల్పించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దొడ్డా అర్జున్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జీడిమామిడి గింజలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా తాము ఈ విషయమై ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయిందని వాపోయారు. మరికొద్ది రోజుల్లో జీడిగింజలు సీజన్ ప్రారంభం కాబోతోందని, వెంటనే గిట్టుబాటుధర ప్రకటించాలని కోరారు. 80 కిలోల జీడిగింజల బస్తాకు కనీసం రూ.10 వేలు గిట్టుబాటు ధరగా ప్రకటించాలన్నారు.

త్రిమూర్తులుస్వామిని దర్శించుకున్న బీవీఆర్

రాజానగరం, ఫిబ్రవరి 26: మండలంలో నరేంద్రపురంలోని త్రిమూర్తులుస్వామి 77వ కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి స్వామివారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా రాజరాజేశ్వరిదేవి శిఖర ప్రతిష్ఠాపన

రాజానగరం, ఫిబ్రవరి 26: రాజానగరంలోని శివాలయ ప్రాంగణంలోని శ్రీరాజరాజేశ్వరి దేవి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. పునఃపూజలు, పూర్ణాహుతి, మహా సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం శిఖర ప్రతిష్ఠాపన జరిపించారు. గోమాత దర్శనం అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రముఖ వ్యాపారవేత్త, దాత కుందుల బలరామకృష్ణ దంపతులతో వేదపండితులు ప్రతిష్ఠ క్రతువు జరిపించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకుడు సోము వీర్రాజు, జక్కంపూడి విజయలక్ష్మితో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు జనసేన పాదయాత్ర

కడియం, ఫిబ్రవరి 26: ఈ నెల 27న కడియం దేవీచౌక్ సెంటర్ నుంచి రాజమహేంద్రవరం డీలక్స్ సెంటర్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు జనసేన పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం కడియపులంకలో జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా రాజమహేంద్రవరం రూరల్ సీటు జనసేనకు కేటాయించాలని కోరుతూ పాదయాత్ర చేపడుతున్నట్టు చెప్పారు. సమావేశంలో జనసేన మండలాధ్యక్షుడు ముద్రగడ జమీ, గట్టి నర్సయ్య, వైస్ ఎంపీపీ పంతం గణపతి, ఎంపీటీసీలు గొల్లపల్లి శ్రీను, నాగిరెడ్డి రామకృష్ణ, నాయకులు ఆదిమూలం సాయిబాబా, మార్గాని ఏడుకొండలు, పాటంశెట్టి రవి పాల్గొన్నారు.

డమ్మీ పట్టాల తయారీపై చర్యలు చేపట్టాలి

▸ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు

అనపర్తి, ఫిబ్రవరి 26: రెండు రోజుల క్రితం అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో వెలుగు చూసిన డమ్మీ ఇళ్ల పట్టాలపై చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం వెలగపూడిలోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి కోటేశ్వరరావుకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్‌తో కలిసి ఫిర్యాదు చేశారు. శనివారం అనపర్తి తహసీల్దార్ కార్యాలయంలో వెలుగు చూసిన డమ్మీ పట్టాల తయారీపై రామకృష్ణారెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ స్పందన కార్యాలయంలో ఫిర్యాదు అందజేసి అక్కడి నుంచి వెలగపూడిలోని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వైసీపీ ప్రభుత్వం భూసేకరణ జరుగకుండానే పట్టాలు తయారు చేస్తున్నారని, కొన్ని గ్రామాల్లో పంపిణీ కూడా చేశారన్నారు. శనివారం అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో డీటీ టేబుల్‌పై డమ్మీ పట్టాలు ఉండడంతో ఆయనను వివరణ కోరగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో కలెక్టర్‌కు, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశానన్నారు. అలాగే బిక్కవోలులో బదిలీ అయిన తహశీల్దార్ పాత తేదీలతో సంతకాలు చేయడంపై తాను చేసిన ఫిర్యాదుపై జిల్లా అధికారులు తాత్సారం చేస్తున్న అంశాన్ని కూడా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్టు రామకృష్ణారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెంట టీడీపీ నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, సత్తి దేవదానరెడ్డి తదితరులున్నారు.



వెలగపూడిలోని అడిషనల్ సీఈవో కోటేశ్వరరావుకు ఫిర్యాదు అందజేస్తున్న నల్లమిల్లి

టీడీపీలో చేరిన వైసీపీ బూత్ కన్వీనర్లు

అనపర్తి మండలం కొప్పవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ బూత్ కన్వీనర్లు సోమవారం రామవరంలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వైసీపీ బూత్ కన్వీనర్లుగా పనిచేస్తున్న కొమరపు దుర్గాప్రసాద్, మరక సోంబాబు, మేడిశెట్టి సత్యనారాయణ, రావు సత్యనారాయణలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నేతలు చేస్తున్న కక్ష పూరిత రాజకీయాలపై విరక్తి చెందిన అనేక మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, తేనెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శుభకరన్‌సింగ్‌కు నివాళులు



కడియం, ఫిబ్రవరి 26: మూడు వ్యవసాయ నల్ల చట్టాల రద్దు కోరుతూ జిల్లా సరిహద్దుల్లో పునఃప్రారంభించిన రైతాంగం ఉద్యమంపై కాల్పులు జరిపి రైతు పోరాట యోధుడు శుభకరన్‌సింగ్‌ను కాల్చి చంపి, 135మంది రైతులను గాయపరిచిన మోదీ ప్రభుత్వం ఫాసిస్టు నిర్బంధాన్ని ఖండిస్తూ అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో దుళ్ల ఎర్రకాలనీలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకుడు వెంటపల్లి భీమశంకరం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, రైతుకూలీ సంఘం నాయకులు అలజంగి గడ్డియ్య, గెద్దాడ తాతబ్బాయి, పితాని ధనలక్ష్మి, వి.చిన్నమ్ములు, గుదిరెడ్ల నర్సమ్మ, పసుపులేటి లక్ష్మి పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ, ఫిబ్రవరి 26: ప్రతిగ్రామంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అంతర్గత రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో రూ.2.60 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో నిర్మించనున్న బుచ్చింపేట-మునగాల రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో నిర్లక్ష్యానికి గురైన కనెక్టవిటీ రోడ్లను నిర్మిస్తామని, దీనిలో భాగంగా ఈ రోడ్డుపనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, నక్కా రాంబాబు, బొరుసు బద్రి, కడియాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పల్లి జాన్ మృతిపై విచారణ జరపాలని వినతి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26: రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడుకు చెందిన పల్లి జాన్ మృతిపై సీబీఐతో విచారణ జరపాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో చైత్రవర్షిణికి వినతిపత్రం అందజేశారు. మృతుడి తల్లిదండ్రులు పల్లి కుమారి, పల్లి చిన్ని మాట్లాడుతూ జాన్‌ను పథకం ప్రకారం హత్య చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. మృతిచెంది ఏడాది గడుస్తున్నా పోలీసు దర్యాప్తు నత్తనడకన సాగుతోందని, వాస్తవాలు మరుగు పరిచేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజీమాల్ వై.స్క్రీన్ 1	సిద్ధార్థరాయ్
వై.స్క్రీన్ 2	ఈగల్
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	ఊరి పేరు భైరవ కోన
నిడదవోలు	
వీ మ్యాక్స్	ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ	సిద్ధార్థరాయ్
శ్రీగణపతి	వ్యూహం
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్